
ఏదో ఒకటి చేయాలన్న తపన,
ఏదైనా సాధించినప్పుడు పొందే తృప్తి..
వీటిని మించిన ప్రోత్సాహకాలు లేవు.
- రామోజీరావు
జననం:
1936, నవంబరు 16.
మరణం:
2024, జూన్ 8.
నింగికేగిన సామాన్యుడి అక్షరం!
నేలంతా పరచుకున్న పెను విషాదం!!
- మహా మనీషికి వినమ్ర నివాళి



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




అస్తమించిన **అక్షర సూరీడు**

- పట్టుదలకు, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం
- వేలాదిమందికి ఉపాధి కల్పించిన కల్పవృక్షం
- రామోజీకి టీడీపీ నేతల ఘన నివాళి

7


## అక్షరయోధుని
# అస్తమయం!

సామాన్యుడిగా పుట్టి అసామాన్య రీతిలో శిఖరస్థాయికి ఎదిగిన రామోజీరావు ఇకలేరు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి.. అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ చెరగని ముద్ర వేసిన రామోజీ రైతుబిడ్డగా మొదలై అతిపెద్ద వ్యాపారవేత్తగా ఎదిగారు. మీడియా సంస్థల సారథిగా ప్రజాహితాన్ని కాంక్షించారు. అక్షరాన్నే ఆయుధంగా చేసుకుని ధర్మం కోసం ధైర్యంగా పోరాడిన యోధుడు. ధరిత్రి ఎరుగని చరిత్రను సొంతం చేసుకున్న నిత్యాక్షర చైతన్యశీలి. అఖండ తెలుగు నేలను అర్ధశతాబ్దంపాటు నిష్పాక్షిక అక్షరాభిషేకంతో పునీతం చేసిన మీడియా దిగ్గజం. దుర్మార్గ పాలకుల దుష్టపోకడలను అక్షరాయుధంతో దునుమాడి.. సామాన్యుడికి బలమైన అండగా నిలిచిన అక్షరయోధుడు రామోజీ అనారోగ్యంతో కన్నుమూశారు.





- అనారోగ్యంతో కన్నుమూసిన రామోజీ
- రాష్ట్రపతి, ప్రధాని, చంద్రబాబు, ప్రముఖుల సంతాపం
- తెలుగు రాష్ట్రాల్లో విషాదఛాయలు
- అధికార లాంఛనాలతో నేటి ఉదయం ఫిల్మ్‌సిటీలో అంత్యక్రియలు
- ఏపీలో రెండురోజులు సంతాప దినాలు
- రంగమేదైనా విజయం ఆయన సొంతం
- నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం

2

## మరో చరిత్రకు
# నేడే శ్రీకారం



- ప్రధానిగా మూడోసారి మోదీ ప్రమాణస్వీకారం
- నెహ్రూ రికార్డును సమం చేస్తున్న మోదీ
- కేంద్ర కొలువులో తెదేపా మంత్రులు
- అతిథులుగా పొరుగు దేశాధినేతలు
- ఢిల్లీలో హై అలెర్ట్

4

## పొలిటికల్ పెన్‌కౌంటర్



ఎన్నికల తర్వాత ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్సీపీని -టీడీపీ, జనసేన టార్గెట్ చేస్తోంది. పోలీసుల స్పందన లేదు. దాడులపై హైకోర్టుకు వెళ్తాం. రాబోయే రెండు రోజుల్లో కృష్ణాజిల్లాలో పర్యటించి, కార్యకర్తలకు ధైర్యం చెబుతాం.

-కొడాలి నాని

ఆనాటివి ఏమాయెను
ప్రదర్శించె పౌరుషాలు!
ప్రజాగ్రహపు తుపానులకు
బెదురుతోన్న వైకాపాలు!!

ఐదేళ్లుగ.. ఇదే భయం
అనుభవించె రాష్ట్రమంత!
కనపడలేదా అప్పుడు
మీ కళ్లకు జనమంతా!!

దాడులతో దండాకోరు
మీరెకదా ఆడినారు!
కీలెరిగి వాతపెడితె
జనంలోన ఓడినారు!!

న్యాయమంటె ధర్మమంటె
లెక్కలేని తనం మీది!
ఫ్యానుగాళ్ల మొత్తుకున్న
జనం వినరు మీ సోది!!

-మహాదేవ

## రామోజీరావు వ్యక్తి కాదు... వ్యవస్థ

- ధర్మానికి కట్టుబడి సమాజహితం కోసం అనునిత్యం పని చేశారు
- ఆయన మరణం జీర్ణించుకోలేనిది: చంద్రబాబు
- రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించిన చంద్రబాబు దంపతులు



5

కేంద్ర ప్రభుత్వంలో
## తెదేపా ఐదోసారి

- పార్టీ పెట్టిన రెండేళ్లకే లోక్‌సభలో ప్రతిపక్షంగా తెదేపా
- ఏడేళ్లకే కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం
- మొదటి తెదేపా కేంద్ర మంత్రిగా పర్వతనేని ఉపేంద్ర
- ఇప్పటి వరకు కేంద్రంలో 11 శాఖలు నిర్వహించిన తెదేపా మంత్రులు
- 1999-2004 కాలంలో వాజ్‌పేయి ప్రభుత్వానికి మద్దతు

3

రామోజీకి ప్రముఖుల ఘన నివాళి 8,9 లో..

## నిలబడ్డాడు..
# కలబడ్డాడు!!



- లోకేష్ అలుపెరగని పోరాటంతో పసుపుజెండా రెపరెపలు
- కష్టకాలంలో ముందుండి నడిపించిన యువగళం దళపతి

ఏ రాజకీయ పార్టీకైనా నింగీ నేలా.. ఆదీ అంతం.. దిక్కూ మొక్కూ -సామాన్య కార్యకర్తలే. నాయకుడై వాళ్లకు దూరంగా కాదు, సామాన్య కార్యకర్తగా శ్రేణుల మధ్య నిలబడ్డాడు లోకేష్. నమ్మిన ప్రజలు, నమ్మకమైన అభిమానులు, నడిచొచ్చే శ్రేణుల గుండె ధైర్యమై నిలబడ్డాడు. పిలిస్తే పలికాడు. కష్టమొస్తే కదిలాడు. కన్నీళ్లను తుడిచాడు. బాధకు ఓదార్పయ్యాడు. జనం కోసం నిలబడ్డాడు. జగన్ మూకలతో కలబడ్డాడు. సర్కారు దాష్టీకంపై సాధుజనం గొంతు విప్పడానికి భయపడుతున్న సమయంలో -పచ్చ జెండా ఫెళఫెళలతో వైసీపీ అరాచకంపై తుపానులా విరుచుకుపడ్డాడు లోకేష్. శ్రేణులను తాకాలంటే తనను దాటెళ్లాలన్నట్టే -వైసీపీ మూకలముందు రక్షణ గోడై నిలిచాడు. యువగళం పాదయాత్రలో అడుగడుగునా కనిపించిన దృశ్యాలివి. తమ మధ్యనుంటూ తమతో నడిచిన నాయకుడిపట్ల శ్రేణులు పెంచుకున్న నమ్మకం -మొన్నటి ఎన్నికల్లో చూశాం. పార్టీ ఏజెంట్లను ప్రత్యర్థి మూకలు రక్తమోడేలా కొడుతుంటే.. నిలబడ్డారు, కలబడ్డారేగానీ పారిపోలేదు. అది -యువనేత లోకేష్ ఇచ్చిన ధైర్యం. పార్టీ అధినేత నుంచి సామాన్య కార్యకర్తలవరకు తప్పుడు కేసులతో వేధించిన జగన్మోహన్‌రెడ్డి అరాచక ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించడంలో లోకేష్ చూపిన తెగువే.. పార్టీని విజయతీరాలకు చేర్చింది.

6



# అక్షరయోధుని అస్తమయం!

- అనారోగ్యంతో కన్నుమూసిన రామోజీ
- రాష్ట్రపతి, ప్రధాని, చంద్రబాబు, ప్రముఖుల సంతాపం
- తెలుగు రాష్ట్రాల్లో విషాదఛాయలు
- అధికార లాంఛనాలతో నేటి ఉదయం ఫిల్మ్‌సిటీలో అంత్యక్రియలు
- ఏపీలో రెండురోజులు సంతాప దినాలు
- రంగమేదైనా విజయం ఆయన సొంతం
- నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం

హైదరాబాద్: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు(88) కన్నుమూశారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. రామోజీ అంత్యక్రియలు ఫిల్మ్ సిటీలో ఆదివారం ఉదయం 9-10 గంటల మధ్య తెలంగాణ ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరుగుతాయి. రామోజీ మృతి కారణంగా ఏపీలో ఈ నెల 9, 10 తేదీల్లో సంతాపదినాలుగా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మీడియా దిగ్గజం రామోజీ మృతితో తెలుగురాష్ట్రాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. 1936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. అక్కలు రాజ్యలక్ష్మి, రంగనాయకమ్మ తర్వాత ఆయన జన్మించారు. కుటుంబసభ్యులు తొలుత రామోజీకి.. తాతయ్య రామయ్య పేరు పెట్టారు. బడిలో మాస్టారుకు తన పేరు రామోజీరావు అని చెప్పి.. తన పేరును తనే పెట్టుకున్నారు. 1951లో ఆయన హైస్కూల్ విద్యాభ్యాసం ముగిసింది. గుడివాడ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివారు. అనంతరం అక్కడే బీఎస్సీ పూర్తి చేశారు. 1961 ఆగస్టు 19న పెనమలూరుకు చెందిన తాతినేని రమాదేవిని ఆయన వివాహమాడారు. పెళ్లి తర్వాత భార్యతో కలిసి దేశరాజధాని ఢిల్లీకి మకాం మార్చారు. 1962లో పెద్ద కుమారుడు కిరణ్ పుట్టిన తర్వాత ఢిల్లీలో ఉద్యోగాన్ని మానేసి వ్యాపారరంగంలోకి అడుగుపెట్టేందుకు మార్గం సిద్ధం చేసుకున్నారు. అడుగు పెట్టిన ప్రతి రంగంలోనూ ఆయన చెరగని ముద్ర వేశారు. అనుకున్న లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారు. మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన రామోజీరావు.. ఎన్నో చిత్రరాజాలను కూడా సృష్టించారు. దేశానికే తలమానికంగా రామోజీ ఫిల్మ్ సిటీని సృష్టించారు. ఆఖరి క్షణం వరకూ ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారు. పనిలోనే విశ్రాంతి అనేది ఆయన నమ్మిన సిద్ధాంతం. చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని ఆచరించిన మహనీయుడు.

## మార్గదర్శి చిట్‌ఫండ్స్..

రైతు నేపథ్యం ఉన్న రామోజీరావు 1962లో హైదరాబాద్ కేంద్రంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను నెలకొల్పారు. హిమాయత్ నగర్‌లో కేవలం ఇద్దరు ఉద్యోగులతో సంస్థను ప్రారంభించారు. మార్గదర్శి ప్రచారం కోసం కిరణ్ యాడ్స్ పేరిట యాడ్ ఏజెన్సీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏజెన్సీ, హైదరాబాద్‌లో ప్రభుత్వ గుర్తింపు పొందిన తొలి యాడ్ ఏజెన్సీగా నిలిచింది. కొద్ది కాలానికే మార్గదర్శి రెండో శాఖను విశాఖపట్టణంలో నెలకొల్పారు. ప్రస్తుతం ఈ సంస్థ నాలుగు రాష్ట్రాల్లో 113 శాఖలు, 3 లక్షలకుపైగా ఖాతాదారులు, 4100 మందికిపైగా ఉద్యోగులు, 18 వేలకుపైగా ఏజెంట్లతో చక్కటి వృద్ధిలో ముందుకు సాగుతోంది. 60 ఏళ్లలో లక్షలాదిమంది ఖాతాదారులకు నిబద్ధతతో సేవలు అందించారు. ఈ సంస్థ ద్వారా వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించారు.

## 1969లో 'అన్నదాత మాసపత్రిక' ప్రారంభం

రైతు కుటుంబానికి చెందిన రామోజీరావు... రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెలకువలు నేర్పేందుకు 1969లో 'అన్నదాత' మాసపత్రికను స్థాపించారు. ఈ పత్రిక అనతికాలంలోనే తెలుగు రైతుల మనసులను దోచుకుంది. ఆధునిక సేద్యంలో రైతుల ప్రియనేస్తంగా మారిపోయింది. ఈ పత్రిక చందాదారులకు ప్రతి ఏడాది ఒక ఉచిత డైరీని కానుకగా అందిస్తుంటారు. ఆ తర్వాత వచ్చినవే ఈనాడులోని 'రైతేరాజు', ఈటీవీలోని అన్నదాత కార్యక్రమం, ఈటీవీ-2లోని జైకిసాన్. ఇప్పటికీ 'అన్నదాత' కార్యక్రమం ఈటీవీలో నిరంతరాయంగా కొనసాగుతోంది. నిత్యం కష్టాల సేద్యం చేసే రైతులకు సకాలంలో సలహాలు, సూచనలిచ్చే యంత్రాంగం లేదు.. పంటల సాగుపై వారికి సరైన పరిజ్ఞానం లేదు.. అందుచేత మన రైతాంగంలో ఆధునిక పరిజ్ఞానం పెంపొందించి, తోడ్పడాలనే ధ్యేయంతో 'అన్నదాత' అనే ఒక మాసపత్రికను ప్రారంభించినట్లు ఒక సందర్భంలో రామోజీరావు చెప్పారు.

ఇక ఆ తర్వాతి కాలంలో విశాఖపట్నంలో డాల్ఫిన్ పేరిట హోటల్‌ను కూడా నిర్మించారు. వ్యాపార పనుల నిమిత్తం నిత్యం హైదరాబాద్, విశాఖ, ఢిల్లీల మధ్య తిరుగుతూ క్షణం తీరిక లేకుండా కార్యకలాపాలను చక్కబెట్టుకుంటున్న సమయంలో యాదృచ్ఛికంగా ఆయనకు ఈ ఆలోచన వచ్చింది.

## ఈనాడు' పత్రికకు బీజం పడింది ఇలా..

1970 దశకంలో విజయవాడ, హైదరాబాద్‌లలోనే వార్తా పత్రికల ముద్రణ జరిగేది. విజయవాడలో తయారయ్యే పత్రిక విశాఖ చేరాలంటే మధ్యాహ్నం అయ్యేది. ఇదే విషయాన్ని నాటి ఆంధ్రజ్యోతి వ్యవస్థాపకులు కేఎల్ఎన్ ప్రసాద్ వద్ద రామోజీరావు ప్రస్తావించారు. విశాఖలో పత్రికను ముద్రించాలని కోరారు. అయితే పత్రిక ప్రచురణ వ్యయ ప్రయాసలతో కూడినదంటూ ప్రసాద్ చెప్పిన సమాధానంతో రామోజీరావు ఏకీభవించలేకపోయారు. విశాఖలో తానే ఓ పత్రికను ప్రచురిస్తే ఎలా ఉంటుందని భావించారు. అనుకున్నదే తడవుగా రంగంలోకి దిగారు. 1974 ఆగస్టు 10న విశాఖలో 'ఈనాడు'కు ఊపిరి పోశారు. వార్తల ప్రచురణ నుంచి పేపర్ విక్రయం దాకా తన సొంత శైలితో ముందుకెళ్లారు. అప్పటి వరకు ఉదయాన్నే పత్రిక ముఖం చూడటం కొత్తయిన విశాఖ వాసులు ఈనాడు పత్రిక కోసం ఎగబడ్డారు. తన మార్కెటింగ్ నైపుణ్యాలతో పత్రిక సర్క్యులేషన్‌ను అనతి కాలంలోనే రామోజీరావు పెంచేశారు. ఏడాది గడిచిందో లేదో... 1975, డిసెంబర్ 17న ఈనాడు రెండో ఎడిషన్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. మరో రెండేళ్లకు విజయవాడ ఎడిషన్‌ను కూడా అట్టహాసంగా ప్రారంభించారు. ప్రస్తుతం పెద్ద సంఖ్యలో ఎడిషన్లతో ఈనాడు పత్రిక తెలుగు రాష్ట్రాల్లో అధిక సర్క్యులేషన్ ఉన్న పత్రికగా నడుస్తోంది. జీవితాంతం ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించిన ఆయన... 'ఈనాడు' దినపత్రిక ద్వారా వేలమంది పాత్రికేయులను తయారు చేశారు. ఓ దిన పత్రికలో 'సినిమా'కంటూ ఓ ప్రత్యేకమైన పేజీ తీసుకొని రావాలన్న ఆలోచనకు అంకురార్పణ చేసింది రామోజీ రావునే. 'ఈనాడు'లో సినిమా పేజీ మొదలుపెట్టిన తరవాత అన్ని దినపత్రికలూ ఆయన్ని అనుసరించాయి.

## ప్రపంచానికి తెలుగు రుచుల పరిచయం...

తెలుగువారి వంటకాల రుచులను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి రామోజీరావు. 1980 ఫిబ్రవరిలో ప్రియా ఫుడ్స్‌ను ప్రారంభించారు. ప్రియా పచ్చళ్లు, స్నాక్స్ వినియోగదారుల మనసును దోచుకున్నాయి. అత్యున్నతమైన నాణ్యతతో వందల రకాల ఉత్పత్తులను ప్రియా ఫుడ్స్ ద్వారా తీసుకొచ్చారు. ఆహార ఉత్పత్తుల రంగంలో ప్రియా ఫుడ్స్‌కు అనేక రాష్ట్ర జాతీయ పురస్కారాలు లభించాయి. మన దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ఈ ప్రియా ఉత్పత్తులకు మంచి గిరాకీ వుంది.

## సినిమా రంగంలోకి

రామోజీరావు సినీ పరిశ్రమలోనూ విజయవంతమయ్యారు. సినిమా నిర్మాణ రంగంలోకి దిగిన రామోజీ పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. రాష్ట్ర స్థాయిలోనే కాక జాతీయ స్థాయిలోనూ అవార్డులను కైవసం చేసుకున్నారు. సినిమాల నిర్మాణం కోసం ఉషా కిరణ్ మూవీస్, చిత్ర పంపిణీ కోసం మయూరి డిస్ట్రిబ్యూటర్స్‌లను ఆయన నెలకొల్పారు. సినిమా పంపిణీ రంగంలో వాస్తవ లెక్కలను చూపుతూ మయూరి సంస్థ నిర్మాతలను ఆకట్టుకుంది. ముఖ్యంగా చిన్న నిర్మాతలకు తమ సినిమాల విడుదల విషయంలో ఈ పంపిణీ సంస్థ ఎంతో ఉపయోగపడింది. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా తెలుగు సినిమా నిర్మాణాన్ని రామోజీరావు కొత్త పుంతలు తొక్కించారు. 'స్టార్‌డం' ఆధారంగా చిత్ర నిర్మాణం సాగుతున్న దశలో రామోజీ 'కథే మా హీరో' అన్న నినాదంతో చిత్ర నిర్మాణాన్ని చేసేవారు. కొన్ని సినిమాలకు వాస్తవ సంఘటనలను కూడా ఆయన ఎంచుకున్నారు. తక్కువ బడ్జెట్‌లో సినిమాలు నిర్మించి ఎక్కువ లాభాలు ఎలా పొందవచ్చో ఆయన చేసి చూపించారు. ఆయన నిర్మించిన శ్రీవారికి ప్రేమలేఖ, ప్రేమించు పెళ్లాడు, ప్రతిఘటన, మయూరి, మౌనపోరాటం, పీపుల్స్ ఎన్‌కౌంటర్, అశ్వని... వంటి సినిమాలు కొత్త తరహాగా సాగుతూ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రామోజీకి భారీ లాభాలను తెచ్చిపెట్టాయి. మంచి కథతో సరైన సినిమా తీస్తే ఎంతగా లాభాలు వస్తాయన్న విషయం ఆయనకు 'ప్రతిఘటన' సినిమా ద్వారా తెలిసిందని ఒక సందర్భంలో చెప్పారు. వివిధ భాషల్లో ఆయన 87 చిత్రాలను నిర్మించారు. ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ ద్వారా ఎంతో మంది నటులు పరిచయమై ఇవాళ అగ్రశ్రేణి నటులుగా ఉన్నారు. భారతీయ చలనచిత్ర రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చిన గొప్ప వ్యక్తి రామోజీ.

## టీవీ రంగంలో ట్రెండ్ సెట్టర్

టీవీ రంగం ద్వారా వేలాది నూతన నటీనటులను బుల్లితెరకు పరిచయం చేశారు. టీవీ ప్రపంచంలో రామోజీరావుది చెరగని ముద్ర. ఈటీవీ... మీటీవీ.. అంటూ అద్భుతాలు సృష్టించిన వ్యక్తి ఆయన. 1995 ఆగస్టులో తెలుగు ప్రేక్షకుల కోసం ఈటీవీని ప్రారంభించారు. తక్కువ సమయంలోనే జాతీయ స్థాయి నెట్‌వర్క్‌గా ఈటీవీ విస్తరించింది. ప్రతిక్షణం ప్రపంచ వీక్షణం పేరిట 13 భాషల్లో వార్తలు అందించారు. తెలుగు రాష్ట్రాల కోసం ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ ఛానళ్లు ప్రారంభించారు. విశ్వసనీయ వార్తా ఛానళ్లుగా ఈటీవీ న్యూస్ ఛానళ్లను తీర్చిదిద్దారు.

వినోద రంగాల్లోనూ తెలుగువారిని ఈటీవీ ఛానళ్లు అలరించాయి. ఈటీవీ ప్లస్, ఈటీవీ సినిమా, ఈటీవీ అభిరుచి, ఈటీవీ లైఫ్,

- (మిగతా వివరాలు 3లో)

# కేంద్ర ప్రభుత్వంలో తెదేపా ఐదోసారి

- పార్టీ పెట్టిన రెండేళ్లకే లోక్‌సభలో ప్రతిపక్షంగా తెదేపా
- ఏడేళ్లకే కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం
- మొదటి తెదేపా కేంద్ర మంత్రిగా పర్వతనేని ఉపేంద్ర
- ఇప్పటి వరకు కేంద్రంలో 11 శాఖలు నిర్వహించిన తెదేపా మంత్రులు
- 1999-2004 కాలంలో వాజ్ పేయి ప్రభుత్వానికి మద్దతు

తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వంలో ఐదోసారి భాగస్వామి కానుంది. నేటి సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఏర్పడనున్న కేంద్ర ప్రభుత్వంలో తెదేపా అధికారం పంచుకోనుంది.దీనితో... వివిధ సమయాల్లో 5కేంద్ర ప్రభుత్వాల్లో తెదేపా అధికారం పంచుకోవడం విశేషం.

1982లో ఏర్పాటయి మరు సంవత్సరమే ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి రికార్డు నెలకొల్పిన తెదేపా, 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో మొదలు పెట్టి ఇటీవల జరిగిన 18వ సార్వత్రిక ఎన్నికల వరకు కేంద్ర రాజకీయాల్లో విశేషమైన పాత్ర పోషించింది.

## లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా తెదేపా

1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో 30 లోక్‌సభ స్థానాలు గెలుచుకొని తెదేపా లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది. పార్టీ ఏర్పడిన రెండు సంవత్సరాల్లోనే లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగడం అప్పట్లో రాజకీయ సంచలనాన్ని సృష్టించింది. తెదేపా లోక్‌సభ సభ్యుడు సి. మాధవ్ రెడ్డి 1984 -89 కాలంలో దిగువ సభలో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు.

## ఏడేళ్లలోనే కేంద్ర ప్రభుత్వంలో తెదేపా

స్వర్గీయ నందమూరి తారక రామారావు 1982లో స్థాపించిన తెదేపా ఏడేళ్లలోనే కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి అయ్యింది. బోఫోర్స్ కుంభకోణం నేపథ్యంలో 1989లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్ గాంధీ ప్రధానిగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమితో జనతాదళ్ నాయకుడు విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధానిగా కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. వివిధ పార్టీలతో కూడిన నేషనల్ ఫ్రంట్‌కు ఎన్టీఆర్ ఛైర్మన్‌గా ఉన్నారు. తెదేపా తరుపున కేంద్రంలో తొలిసారి కాబినెట్ పదవిని అలంకరించిన గౌరవం పర్వతనేని ఉపేంద్రకు దక్కింది. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఆయన సమాచార, ప్రసార శాఖ మంత్రిగా వ్యవహరించారు.

అనంతరం తెదేపా మరో మూడు సార్లు కేంద్ర ప్రభుత్వంలో అధికారం పంచుకుంది. రెండు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాల్లోనూ, మొదటి నరేంద్ర మోదీ ప్రభుత్వంలోనూ తెదేపా భాగస్వామిగా ఉంది.

## లోక్‌సభ మొదటి దళిత స్పీకర్‌గా బాలయోగి

నాలుగు సార్లు కేంద్ర ప్రభుత్వంలో అధికారం పంచుకోవడంతో పాటు 1999-2004 కాలంలో ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి తెదేపా మద్దతునిచ్చింది. ఈ సమయంలోనే తెదేపా అధినేత చంద్రబాబు నిర్ణయం మేరకు అమలాపురం ఎంపీ, దళిత వర్గానికి చెందిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా నియమితులయ్యారు. 1999లో స్పీకర్‌గా ఎన్నికైన బాలయోగి 2002లో హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయేవరకు ఆ పదవిలో కొనసాగారు. అప్పటికి 52 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో దళితుడిని తొలిసారిగా లోక్‌సభ స్పీకర్‌గా చేసిన ఘనత తెదేపాకే దక్కింది.

ఇప్పటి దాకా నాలుగు కేంద్ర ప్రభుత్వాల్లో తెదేపా మంత్రులు నిర్వహించిన శాఖల వివరాలు:

| క్రసం | ప్రధాన మంత్రి | అధికార కూటమి | తెదేపా మంత్రులు | శాఖలు |
|---|---|---|---|---|
| 1 | వి.పి.సింగ్ (02.12.1989-10.11.1990) | నేషనల్ ఫ్రంట్ | పర్వతనేని ఉపేంద్ర | 1. సమాచార, ప్రసార శాఖ |
| 2. | దేవేగౌడ (01.06.1996 -21.04.1997) | యునైటెడ్ ఫ్రంట్ | 1. కింజరాపు ఎర్రన్నాయుడు (కేబినెట్ మంత్రి)<br>2. డా.ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (స్వయం ప్రతిపత్తి కలిగిన రాష్ట్ర మంత్రి మరియు రాష్ట్ర మంత్రి)<br>3. సముద్రాల వేణుగోపాలాచారి (రాష్ట్ర మంత్రి) | 1. గ్రామీణ ప్రాంతాలు, ఉపాధి శాఖ<br>2. పట్టణ ప్రాంతాలు మరియు ఉపాధి, వ్యవసాయం, పార్లమెంటరీ వ్యవహారం<br>3. సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ |
| 3. | ఐ.కె.గుజ్రాల్ (21.04.1997-19.03.1998) | యునైటెడ్ ఫ్రంట్ | 1. కింజరాపు ఎర్రన్నాయుడు (కేబినెట్ హెూదా)<br>2. డా.ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (స్వయం ప్రతిపత్తి కలిగిన రాష్ట్ర మంత్రి)<br>3. బోళ్ల బుల్లిరామయ్య(స్వయం ప్రతిపత్తి కలిగిన రాష్ట్ర మంత్రి)<br>4. డా.ఎస్.వేణుగోపాలాచారి | 1. గ్రామీణ ప్రాంతాలు మరియు ఉపాధి.<br>2. పట్టణ ప్రాంతాలు మరియు ఉపాధి<br>3. వాణిజ్యం<br>4. విద్యుత్, వ్యవసాయం |
| 4. | నరేంద్ర మోదీ (26.05.2014-30.05.2019) | ఎన్డీఏ కూటమి | 1. పూసపాటి అశోక్ గజపతి రాజు (కేబినెట్ మంత్రి) (27.05.2014-09.03.2018)<br>2. వై.ఎస్.చౌదరి (09.11.2014-09.03.2018) (రాష్ట్ర మంత్రి హెూదా) | 1. పౌర విమానయాన శాఖ<br>2. శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల శాఖ మరియు భూ విజ్ఞాన శాఖ |

---

# అక్షరయోధుని అస్తమయం!

(2వ పేజీ తరువాయి)

ఈటీవీ బాలభారత్ ఛానళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆలోచనల సమాహారంగా పేరొందిన ఆయన... బుల్లితెరపై ఒక ట్రెండ్ సెట్ చేశారు. ఈటీవీ వినోదాత్మక, విజ్ఞానదాయక కార్యక్రమాలు ఆబాలగోపాలాన్ని అలరించాయి. రామోజీ ఆలోచనల నుంచి పుట్టిందే 'పాడుతా తీయగా" కార్యక్రమం. ఈ కార్యక్రమం ద్వారా ప్రేక్షకులపై సుమధుర సంగీత జల్లు కురిపించారు. వందల మంది గాయనీ గాయకులను సంగీత ప్రపంచానికి పరిచయం చేశారు. ఎంతోమంది మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకొచ్చారు. ఎందరో సామాన్యులు రామోజీ ప్రోత్సాహంతో వినోద ప్రపంచంలో రాణించారు.

## కళాంజలి పేరిట కళాఖండాలు..

ఈటీవీ ప్రారంభమైన ఏడాదే రామోజీ గ్రూప్ 'కళాంజలి' పేరిట కళాఖండాల విక్రయాలను ఎగుమతి చేసే విభాగాన్ని ప్రారంభించింది. దీనికి అనుగుణంగా వస్త్ర విక్రయ దుకాణాలను ప్రారంభించింది.

## దేశానికే తలమానికం 'రామోజీ ఫిల్మ్ సిటీ'

చిత్రరంగంలో అడుగుపెట్టిన ఆయన సినిమాల నిర్మాణంలో నిర్మాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా గమనించారు. దీంతో సినీ నిర్మాణానికి సంబంధించిన అన్ని వసతులు ఒకే చోట ఉంటే ఎలా ఉంటుందనే ఆలోచనతో 'రామోజీ ఫిల్మ్ సిటీ' నిర్మాణం దిశగా అడుగులు వేశారు. దాదాపు 1,666 ఎకరాల విస్తీర్ణంలో ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా ప్రపంచంలోనే అత్యంత భారీ స్టూడియోను నిర్మించారు. 1996 అక్టోబర్‌లో రామోజీ ఫిల్మ్ సిటీని ప్రారంభించారు. ఈ నిర్మాణం 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోనూ చోటు దక్కించుకుంది. అంతేకాదు దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా ఈ 'సిటీ' కొనసాగుతోంది.

## కాలుపెడితే విజయమే..

మీడియా మొఘల్‌గా పిలుచుకొనే రామోజీరావులో భిన్న కోణాలు కనిపిస్తాయి. పత్రికా సంపాదకుడిగా, పబ్లిషర్‌గా, నిర్మాతగా, ఈటీవీ అధినేతగా, రామోజీ ఫిల్మ్‌సిటీ సారథిగా ఎన్నో రంగాల్లో తన ఆధిపత్యాన్ని చూపించారు. ఏ రంగంలో అడుగుపెట్టినా విజయఢంకా మోగించడం ఆయన గొప్పతనం. వ్యాపారపరంగా రాజీ పడని విధానం ఆయనది. ప్రతీరంగంలోనూ వ్యాపార కోణమే కాదు, రామోజీరావు అభిరుచి కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ముఖ్యంగా సాహితీ రంగంలో. సితార, విపుల, చతుర పేరుతో 'ఈనాడు'కు అనుబంధంగా కొన్ని ఉప పత్రికలు వచ్చేవి. ముఖ్యంగా విపుల, చతురలో సాహిత్యానికి పెద్ద పీట వేసేవారు. చతుర నవలలు కొన్ని సినిమాలుగానూ వచ్చాయి. తక్కువ రేటుతో విలువైన పత్రికలు ఎలా నడుపుతున్నారో అని పాఠకులు సైతం ఆశ్చర్యపోయేవారు. మాతృభాష పునరుద్ధణోద్యమంలో భాగంగా 'తెలుగు - వెలుగు' పత్రికను ప్రారంభించారు. ఇది రామోజీ మానస పుత్రికగా చెప్పుకోవొచ్చు. ఈ వయసులో కూడా తెలుగు - వెలుగుని దగ్గరుండి చూసుకొన్నారు. 'బాల భారతం' పేరుతో పిల్లల కోసం ఓ మాస పత్రిక తీసుకొచ్చారు. ప్రింటింగ్ నాణ్యత ఎంతో గొప్పగా ఉండేది. రేటేమో తక్కువ. నాకు నష్టాలొచ్చినా ఫర్వాలేదు. సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు చేరువ చేయాలని రామోజీ చెప్పేవారు. కాలక్రమంలో మేగజైన్‌లకు ఆదరణ తగ్గుతూ వచ్చింది. మొదట సితార, విపుల, చతుర మూతబడ్డాయి. కరోనా కలంలో 'తెలుగు వెలుగు', 'బాల భారతం' కూడా ఆగిపోయాయి. అయితే ఈ పత్రికల రూపేణా రామోజీ తెలుగు సాహితీ లోకానికి అందించిన సేవలు మాత్రం మర్చిపోలేనివి.

## 'రాజీ' ఎరుగని రామోజీ!

రామోజీరావు డిక్షనరీలో రాజీ అన్న పదానికి చోటు లేదు. 'రాజీ అనేది ఆత్మహత్యా సదృశం వంటిది' అని ఆయన చెప్పేవారు. అందుకే, ఆయన ఇన్నేళ్ల జీవితంలో ఏ విషయంలోనూ ఎవరితోనూ రాజీ పడలేదు. మార్గదర్శి ఫైనాన్స్ విషయంలోనూ కేసులకు ఆయన అదరలేదు. అయితే అడుగిడిన ప్రతి రంగంలోనూ విజయం సాధించిన రామోజీరావు ఒక్క 'న్యూస్ టైమ్' ఇంగ్లీష్ పేపర్ విషయంలో మాత్రం విజయం పొందలేకపోయారు. మొత్తంగా రామోజీరావు తెలుగు చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేయడమే కాక తన సంస్థల నిర్వహణ కోసం ఏకంగా కొన్ని వ్యవస్థలను నిర్మించుకొని ఆదర్శవ్యక్తిగా నిలిచారు. వేల మందికి ప్రత్యక్ష ఉపాధి.. లెక్కనేనంత మందికి పరోక్ష ఉపాధి చేకూర్చారు.అందుకే రామోజీ యువతరానికి ముమ్మాటికీ మార్గదర్శే.విభిన్న రంగాల్లో సత్తా చాటిన అయనకు కేంద్ర ప్రభుత్వం 2016లో పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది.

గత 5 ఏళ్ళలో జగన్ ప్రభుత్వం చేసిన ఆరాచకాలను, అకృత్యాలను, దోపిడీ, అవినీతి, అనాలోచిత నిర్ణయాలను,అసమర్థ పాలనను ధైర్యంగా ఎండ గట్టారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్‌రాక్షస పాలనను అంతం చేసేందుకు టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి చేస్తున్న పోరాటాలకు బాసటగా నిలిచి అవి అపూర్వమైన విజయం సాధించేందుకు ఎంతగానో తోడ్పడ్డారు. టీడీపీ కూటమి విజయాన్ని చూసిన తర్వాత తాను ఈ లోకానికి వచ్చిన పని పూర్తయిందన్నట్లు తృప్తిగా ఇక సెలవు అంటూ వెళ్ళిపోయారు ధన్యజీవి రామోజీరావు.

ఇలా సామాన్యుడిగాజీవితాన్ని ప్రారంభించి.. అసామాన్యుడిగా ఎదిగి..ఎందరికో ఆదర్శంగా, స్ఫూర్తి గా, మార్గదర్శిగా నిలిచి తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిన ఆ మహనీయునికి నివాళులు.



### జీవించి ఉండగానే స్మారకం

జీవించి ఉండగానే సొంతంగా స్మారకం నిర్మించుకున్న ఏకైక వ్యక్తి రామోజీరావు గారు. 'మరణం ఒక వరం', 'నాకు చావు భయం లేదు' అని చెప్పి చూపించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో స్మారకం ఉంది. రామోజీ వారసత్వం కొనసాగుతుంది. ఆయన చేసిన సేవలను భారతదేశం ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది.

చైతన్యరథం

# మరో చరిత్రకు నేడే శ్రీకారం



- ప్రధానిగా మూడోసారి మోదీ ప్రమాణస్వీకారం
- నెహ్రూ రికార్డును సమం చేస్తున్న మోదీ
- కేంద్ర కొలువులో తెదేపా మంత్రులు
- అతిధులుగా పొరుగు దేశాధినేతలు
- ఢిల్లీలో హై అలెర్ట్

న్యూఢిల్లీ:దేశ రాజకీయ చరిత్రలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కరించబడుతోంది. ప్రధానిగా వరుసగా మూడోసారి నరేంద్ర మోదీ ఈరోజు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. రాత్రి ఏడు గంటల 15 నిమిషాలకు మోదీచే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఆయనతోపాటు కొందరు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణస్వీకారోత్సవం కోసం రాష్ట్రపతి భవన్ ముస్తాబయింది.దేశ, విదేశాల నుండి ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరౌతున్నారు. వరుసగా మూడుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ప్రధానిగా భారత మొట్ట మొదటి ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ రికార్డును మోదీ సమం చేయబోతున్నారు. ఈ ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటే వరుసగా మూడుసార్లు ఎన్నికల్లో గెలిచి పరిపాలనా కాలాన్ని పూర్తి చేసుకున్న మొదటి ప్రధానిగా మోదీ రికార్డులకు ఎక్కుతారు.నెహ్రూ, ఇందిరా గాంధీల తర్వాత ఎక్కువ కాలం ప్రధానిగా సేవలందించిన మూడో ప్రధానిగా కూడా రికార్డు నెల కొల్పనున్నారు.ఈ ప్రమాణస్వీకార ఉత్సవానికి తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హాజరౌతున్నారు.

### పదేళ్ల పాలనలో మోదీ విజయాలు

గత పదేళ్ల కాలంలో తన పరిపాలనతో భారత దేశ సుస్థిరతకు, సౌభాగ్యానికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేశారు. ఈ కాలంలో దేశాన్ని నడిపించిన నాయకుడిగా ఎన్నో విజయాలు సాధించారు. గుజరాత్‌కు 17 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసి ఆ రాష్ట్ర రూపురేఖలను మార్చిన మోదీ ప్రధానిగా ఈ పదేళ్లలో దేశంలోనూ ఎన్నో మార్పులు తెచ్చారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు సైతం నెగిటివ్ వృద్ధి రేటను నమోదు చేయగా నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత దేశం మాత్రం సగటున 7.5శాతం జీడీపీ వృద్ధి రేటును నమోదు చేసింది. సంస్థాగత సంస్కరణలు, ముందు చూపు చర్యలతో మౌళిక సదుపాయాలను వృద్ధి చేసి ఉత్పత్తిని పెంచి వ్యాపార అనుకూల వాతావరణాన్ని మోదీ సృష్టించిన కారణంగానే ఈ వృద్ధి రేటు సాధ్యమయింది. మోదీపాలన కాలంలో భారతదేశం నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. సాంకేతికను, సృజనాత్మకను అందిపుచ్చుకునేలా సంస్కరణలు చేపట్టబట్టే ఈ దిశగా ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగుతోంది. మోదీ పాలన కాలంలో సాధించిన మరో గొప్ప విజయం భారత దేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం. ఈ కాలంలో మోదీ గ్లోబల్ లీడర్‌గా ఉద్భవించడమే కాక ప్రపంచ యవనికపై భారత్ కూడా తనదైన పాత్రను పోషించడం ప్రారంభమైంది. మోదీ సాధించిన మరో అతి గొప్ప విజయం దేశంలో పేదరిక నిర్మూలన. ఈ పదేళ్ల కాలంలో ఆయన అనుసరించిన సంస్కరణలు, అమలు చేసిన అనేక రకాల పథకాల కారణంగా దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. ఎన్నో ఏళ్ల నుండి రావణకష్టంలా కాలుతున్న కశ్మీర్‌లో పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అక్కడి ప్రజలు ఈ ఎన్నికల్లో పెద్ద ఎత్తున పాల్గొని భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసాన్ని వెల్లడించారు. ట్రిపుల్ తలాక్‌ను చట్టవిరుద్ధంగా ప్రకటించి ముస్లిం మహిళలకు తరతరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దారు. బహిరంగ మల విసర్జనను నిర్మూలించేందుకు మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం పెద్ద విజయం సాధించింది. పట్టణాల్లో పేదలకు చౌకగా గృహాలను నిర్మించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా ఎన్నో లక్షల మంది లబ్ధిపొందారు. ఆయుష్మాన్ భారత్, ఉచిత రేషన్, హర్‌ఘర్ జల్, ఉజ్వల్ యోజన, ముద్రా యోజన, పీఎం స్వానిధి స్కీమ్ లాంటి పథకాల ద్వారా ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించారు. ఇలా గత పదేళ్ల కాలంలో ఎన్నో విజయాలను సాధించిన మోదీ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే క్రమంలో మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. మోదీ మూడదఫా పాలన 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు తోడ్పడనుంది. ఆ దిశగా ఇప్పటికే ప్రధాని మోదీ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

### ఢిల్లీలో హై అలెర్ట్

మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేయనున్న తరుణంలో అన్ని ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్రపతి భవన్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. దాంతో ఆ ప్రాంతమంతా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. పారామిలిటరీ బలగాలు, ఎన్‌ఎస్‌జీ కమాండోలు, డ్రోన్లు, స్నైపర్లను మోహరించారు. ఈ కార్యక్రమానికి పొరుగుదేశాలకు చెందిన అధినేతలు రానున్నారు. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవులు, మారిషష్ దేశాధినేతలు రానున్నారు. వారు నిర్దేశించిన మార్గాల్లోనే హోటల్ నుంచి వేదిక వద్దకు వస్తారని అధికారులు తెలిపారు. ఆ మార్గాల్లో స్నైపర్లు, పోలీసు సిబ్బంది పహారా కాయనున్నారు. కొన్ని వ్యూహాత్మక ప్రాంతాల్లో డ్రోన్లను మోహరించారు. అలాగే నేతలు బస చేసే హోటళ్లు ఇప్పటికే కట్టుదిట్టమైన రక్షణ వలయంలో ఉన్నాయి. స్కానింగ్ వంటి వాటికోసం కృత్రిమమేధ సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇక రాష్ట్రపతి భవన్ లోపల, బయట మూడు అంచెల భద్రతను ఏర్పాటుచేశారు. మోదీ సహా ఉన్నతస్థాయి వ్యక్తుల రాకపోకల వేళ... వేదిక వద్దకు వెళ్లే పలు మార్గాలను మూసివేసే అవకాశాలున్నాయి. ఆదివారం ఉదయం నుంచే ట్రాఫిక్‌ను దారి మళ్లించనున్నారు. అలాగే ఢిల్లీ సరిహద్దుల్లో తనిఖీలను తీవ్రం చేశారు. ఇక ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన సుమారు 8 వేల మంది అతిథులు హాజరుకానున్నట్లు సమాచారం.

### మోదీ కొలువులో తెదేపా మంత్రులు

ఆరేళ్ల తర్వాత ఎన్డీయే ప్రభుత్వంలో తెదేపా భాగాస్వామ్యమౌతోంది. ఎన్డీయే కూటమిలో 16 సీట్లు కల్గిన టీడీపీ రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. కొత్తగా ఏర్పడే ఎన్డీయే ప్రభుత్వంలో చేరాలని ప్రధాని మోదీ కోరడంతో అందుకు టీడీపీ అధినేత చంద్రబాబు అంగీకరించారు. అయితే మంత్రివర్గంలో చేరికపై చంద్రబాబు మాట్లాడుతూ తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో టీడీపీ కనీసంగా మూడు మంత్రివర్గ స్థానాలు లభించే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది.

ప్రధానితోపాటు కొంతమంది మంత్రులు కూడా నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడుతున్నందున వారికి కూడా కీలక మంత్రి పదవులు కేటాయించనున్నారు. లోక్‌సభలో అతిపెద్ద పార్టీగా బీజేపీకి 240 సీట్లు ఉన్నాయి. ఎన్డీయే భాగస్వాముల్లో ఆ తర్వాత స్థానంలో తెలుగుదేశం పార్టీ 16 స్థానాలతో కీలకంగా ఉంది. మూడో స్థానంలో జనతాదళ్(యునైటెడ్) 12 స్థానాలతో ఉంది. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేనకు ఏడు స్థానాలు ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో రామ్ విలాస్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీకి ఐదుగురు ఎంపీలు ఉన్నారు. కర్నాటకలోని జెడి(ఎస్)కు ఇద్దరు, ఎన్సీపీకి ఇద్దరు, ఆర్‌ఎల్‌డికి ఇద్దరు ఎంపీలు ఉన్నారు. ఒక్కో పార్టీకి ఒక్కో సీటు చొప్పున ఏడు చిన్న పార్టీలకు ఏడుగురు ఎంపీలు ఉన్నారు. వీరిలో కొంతమందికి మంత్రివర్గంలో చోటు దొరకనుంది. ప్రధానమంత్రి తన నిర్ణయం ప్రకారం ఈ పార్టీలకు వాటి శక్తి కొద్ది మంత్రి పదవులను కేటాయించనున్నారు. అయితే ఏ పార్టీకి ఎన్ని మంత్రి పదవులు ఇస్తారు అనేది ఈరోజు స్పష్టత రానుంది.

## ప్రమాణ స్వీకారం తరువాత కలుద్దామనుకున్నా..

### రామోజీ భౌతిక కాయం వద్ద పవన్ నివాళి

హైదరాబాద్: రామోజీగ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు పార్థివదేహానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ (చినబాబు) నివాళులర్పించి, రామోజీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం పవన్ మాట్లాడుతూ రామోజీరావు మరణ వార్త చాలా దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి ఆయన్ను కలుద్దామనుకున్నా. కానీ, ఇంతలోనే దురదృష్టవశాత్తూ కన్నుమూశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వేలాది మంది జర్నలిస్టులు ఈనాడు జర్నలిజం స్కూల్ నుంచి వచ్చిన వారే. ఎంతో మంది జర్నలిస్టులను అందించిన మహానుభావులు ఆయన. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో చేశారు. అత్యున్నత ప్రమాణాలతో గొప్ప ఫిల్మ్ సిటీని నిర్మించారు. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు అండగా ఉండాలి. జనసేన తరఫున సంతాపం తెలియజేస్తున్నానని పవన్ కల్యాణ్ అన్నారు.



## అందరికీ మార్గదర్శకులు

### - ఎడిటర్స్ గిల్డ్

న్యూఢిల్లీ: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఆయనో మార్గనిర్దేశకుడని కొనియాడింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎడిటర్స్ గిల్డ్ మాజీ అధ్యక్షుడు రామోజీరావు మరణం విచారకరం.. మీడియా మొఘల్‌గా ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన రామోజీరావు ఎన్నో మార్గాల్లో మనందరికీ మార్గనిర్దేశకులు.. నిజాన్ని నిర్భయంగా మాట్లాడే గొప్ప వ్యక్తి.. ఆయనో ఐకాన్.. మీడియా రంగానికి ఆయన చేసిన కృషి.. దేశవ్యాప్తంగా జర్నలిస్టులందరిలో నిరంతరం స్ఫూర్తి కలిగిస్తుందని ఎడిటర్స్ గిల్డ్ తమ ప్రకటనలో పేర్కొంది.

1987లో రామోజీరావు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. పత్రికాస్వేచ్ఛ అణచివేతకు అప్పటి ప్రభుత్వం చేసిన ప్రయత్నాల్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించడంలో కీలకపాత్ర పోషించారు.

# రామోజీరావు వ్యక్తి కాదు... వ్యవస్థ

- ధర్మానికి కట్టుబడి సమాజహితం కోసం అనునిత్యం పని చేశారు
- ఆయన మరణం జీర్ణించుకోలేనిది: చంద్రబాబు
- రామోజీరావు పార్థివదేహానికి నివాళు లర్పించిన చంద్రబాబు దంపతులు









అమరావతి: యుగపురుషుడిలా వెలిగిన రామోజీరావు మరణం జీర్ణించుకోలేనిదని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సమాజ హితం కోసం అనునిత్యం కష్టపడ్డ వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. రామోజీ మరణవార్త తెలియడంతో దిగ్భ్రాంతికి గురైన చంద్రబాబు శనివారం ఢిల్లీలో తన కార్యక్రమాలను రద్దు చేసుకుని హుటాహుటీన హైదరాబాద్ చేరుకుని, తన సతీమణి భువనేశ్వరితో కలిసి వెళ్లి ఫిల్మ్‌సిటీలో రామోజీరావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామోజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తీవ్ర విషాదంలో ఉన్న రామోజీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ రామోజీరావు మృతి బాధాకరం అన్నారు. మామూలు గ్రామంలో జన్మించిన ఆయన అసాధారణ విజయాలు సాధించారు...వ్యవస్థలను నిర్మించారు. మార్గదర్శి, ఈనాడు, ఈటీవీ వంటి సంస్థలతో ప్రజలకు చేరువయ్యారు. ఏ ఇంట్లోనైనా నిద్ర లేవగానే ఈనాడు చదవితేనే బయటకు వస్తారు. ప్రజల్ని చైతన్య పరచడానికి రాజీలేని పోరాటం చేశారు. తాను చెప్పినట్లుగానే రామోజీరావు ధర్మం వైపు నిలబడి మంచి కోసం పని చేశారు. చనిపోయే వరకు అనునిత్యం పని చేసి...పనిలో ఉండగా చనిపోతేనే ఆనందంగా ఉంటుందని కోరుకున్న వ్యక్తి ఆయన. రామోజీరావు స్థాపించిన ఈనాడు, ఈటీవీ, ఇతర సంస్థలు ఎప్పటికీ శాశ్వతంగా ఉంటాయి. మీడియా రంగంలోనే కాకుండా చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు అందించారు. దేశంలోనే అత్యున్నత ప్రమానాలతో రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించారు. ఫిల్మ్‌సిటీ వల్ల హైదరాబాద్ లో టూరిజం పెరిగి రాష్ట్రానికి ఆదాయం వచ్చింది. అలాంటి ఆలోచనలు చేసిన మహావ్యక్తి దూరమవ్వడం బాధాకరమని చంద్రబాబు అన్నారు.

## రామోజీ భౌతిక కాయానికి లోకేష్ నివాళి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ హైదరాబాదులోని రామోజీ ఫిలింసిటీలో రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. తన సతీమణి నారా బ్రాహ్మణితో కలిసి వచ్చిన లోకేష్, రామోజీరావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచారు. అనంతరం, రామోజీ తనయుడు కిరణ్ ను పరామర్శించారు. లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.









## తెలుగుజాతికి తీరని లోటు

- నందమూరి రామకృష్ణ



అమరావతి: ఈనాడు గ్రూప్ / మార్గదర్శి సంస్థల అధినేత రామోజీరావు మరణం తెలుగుజాతికి తీరనిలోటని దివంగత ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. రామోజీ తనకు తండ్రి సమానులన్నారు. ఒక సామాన్య రైతు కుటుంబములో జన్మించి స్వయంకృషితో ఉన్నతస్థాయికి చేరుకున్నారు. అన్ని రంగాల్లోనూ సేవలందించారు. ఇటు ప్రెస్ మీడియా/జర్నలిజంలోనే కాకుండా, మార్గదర్శి చిట్స్ చైర్మన్ గాను, సినీ నిర్మాతగా, సినీ స్టూడియో అధినేతగా వివిధ రంగాల్లో చాలామందికి ఉపాధి కల్పించి ఆదుకున్న గొప్ప వ్యక్తి రామోజీ రావు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. మాకుటుంబం తరపున రామోజీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు నందమూరి రామకృష్ణ పేర్కొన్నారు.

## 12న ఉదయం 11.27 గంటలకే చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- నిర్ధారించిన పార్టీ వర్గాలు

అమరావతి: ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ముందు అనుకున్న ప్రకారం ఈ నెల 12వ తేదీ ఉదయం 11.27 గంటలకే జరుగుతుందని పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రమాణ స్వీకార టైం మారింది అంటూ వచ్చిన సమాచారం అవాస్తవం అని తెలిపాయి. ఏపీ సీఎంవో పేరుతో వచ్చిన ట్వీట్ లో ఉదయం 9.27 గంటలకు ప్రమాణ స్వీకారం అని తప్పుగా పోస్ట్ చేశారు... ప్రమాణ స్వీకారం 12 తేదీ ఉదయం 11.27 గంటలకే అని పార్టీ వర్గాలు నిర్ధారించాయి.

# నిలబడ్డాడు.. కలబడ్డాడు!!



- లోకేష్ అలుపెరగని పోరాటంతో పసుపుజెండా రెపరెపలు
- కష్టకాలంలో ముందుండి నడిపించిన యువగళం దళపతి
- అగ్నిపరీక్ష సమర్థవంతంగా ఎదుర్కొన్న యువనేత
- రాష్ట్ర రాజకీయాల్లో "రెడ్ బుక్" పెను సంచలనం

ఏ రాజకీయ పార్టీకైనా నింగీ నేలా.. ఆదీ అంతం.. దిక్కూ మొక్కూ -సామాన్య కార్యకర్తలే. నాయకుడై వాళ్లకు దూరంగా కాదు, సామాన్య కార్యకర్తగా శ్రేణుల మధ్య నిలబడ్డాడు లోకేష్. నమ్మిన ప్రజలు, నమ్మకమైన అభిమానులు, నడిచొచ్చే శ్రేణుల గుండె ధైర్యమై నిలబడ్డాడు. పిలిస్తే పలికాడు. కష్టమొస్తే కదిలాడు. కన్నీళ్లను తుడిచాడు. బాధకు ఓదార్పయ్యాడు. జనం కోసం నిలబడ్డాడు. జగన్ మూకలతో కలబడ్డాడు. సర్కారు దాష్టీకంపై సాధుజనం గొంతు విప్పడానికి భయపడుతున్న సమయంలో -పచ్చ జెండా ఫెళఫెళలతో వైసీపీ అరాచకంపై తుపానులా విరుచుకుపడ్డాడు లోకేష్. శ్రేణులను తాకాలంటే తనను దాటెళ్లాలన్నట్టే -వైసీపీ మూకలముందు రక్షణ గోడై నిలిచాడు. యువగళం పాదయాత్రలో అడుగడుగునా కనిపించిన దృశ్యాలివి. తమ మధ్యనుంటూ తమతో నడిచిన నాయకుడిపట్ల శ్రేణులు పెంచుకున్న నమ్మకం -మొన్నటి ఎన్నికల్లో చూశాం. పార్టీ ఏజెంట్లను ప్రత్యర్థి మూకలు రక్తమోడేలా కొడుతుంటే.. నిలబడ్డారు, కలబడ్డారేగానీ పారిపోలేదు. అది -యువనేత లోకేష్ ఇచ్చిన ధైర్యం. పార్టీ అధినేత నుంచి సామాన్య కార్యకర్తలవరకు తప్పుడు కేసులతో వేధించిన జగన్మోహన్‌రెడ్డి అరాచక ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించడంలో లోకేష్ చూపిన తెగువే.. పార్టీని విజయతీరాలకు చేర్చింది.

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో అరాచకపాలనపై ప్రజలు తమ మనోగతాన్ని బయటకు చెప్పడానికే భయపడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను క్షేత్రస్థాయిలో ఎండగడుతూ అలుపెరగని పోరాటం చేసి తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించిన దమ్మున్న నాయకుడు యువనేత నారా లోకేష్. అరాచకశక్తుల కుట్రలు, కుతంత్రాలకు ఎదురొడ్డి అనునిత్యం ప్రజలమధ్య ఉంటూ వారి కష్టాలు కన్నీళ్లను తుడుస్తూ, కేడర్‌కు మనోధైర్యాన్నిస్తూ లోకేష్ చేసిన పోరాటం యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. పార్టీ అధినేత నుంచి సామాన్య కార్యకర్తలవరకు తప్పుడు కేసులతో వేధించిన జగన్మోహన్ రెడ్డి అరాచక ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించడంలో లోకేష్ చూపిన తెగువ పార్టీని విజయతీరాలకు చేర్చింది. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఐదేళ్లపాటు తాలిబాన్ తరహా నియంతృత్వ పాలన సాగింది. బహిరంగ వేదికలపై ప్రభుత్వాన్ని విమర్శించిన నేతలతోపాటు సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాలను వ్యక్తంచేసిన సాధారణ కార్యకర్తలను సైతం తప్పుడు కేసులతో వేధించారు. కొందరు అరాచక పోలీసు అధికారులు అర్ధరాత్రివేళల్లో గోడలుదూకి, తలుపులు బద్దలుగొట్టి పార్టీ కేడర్‌ను భయభ్రాంతులకు గురిచేశారు. ఒకవైపు ప్రజాక్షేత్రంలో పోరాడుతూ... మరోవైపు కేడర్‌ను కాపాడుకుంటూ ముందుకు సాగారు. అర్ధరాత్రివేళ సాధారణ కార్యకర్త మెసెజ్ చేసినా తక్షణమే స్పందించి వారికి అండగా నిలిచారు. ఎంపీ రఘురామ కృష్ణంరాజులాంటి వారినే థర్డ్ డిగ్రీతో వేధించిన అరాచకప్రభుత్వం పసుపు సైనికులను అన్నిరకాలుగా ఇబ్బందుల పాల్జేసింది. రాష్ట్రంలో దాదాపు 70మందికి పైగా కార్యకర్తలను జగన్ ప్రభుత్వం పొట్టనబెట్టుకుంది. ఈ నేపథ్యంలో పార్టీ కేడర్‌కు అండగా నిలిచేందుకు పార్టీ కేంద్ర కార్యాలయంలో న్యాయనిపుణులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి న్యాయసహాయాన్ని అందించారు. గత ఐదేళ్లలో వివిధ సంఘటనల్లో చనిపోయిన, దెబ్బతిన్న కేడర్‌కు కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా రూ.130కోట్ల రూపాయల సహాయాన్ని అందించారు. అరాచకశక్తుల చేతిలో బలైన వారి బిడ్డలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్యనందిస్తున్నారు. పార్టీ కేడర్‌కు ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ లోకేష్ భరోసా కల్పించారు. రాయలసీమలో పాదయాత్ర సమయంలో లోకేష్ కాళ్లకు బొబ్బలు రావడం చూసిన తల్లి భువనేశ్వరి కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఆ సందర్భంలో లోకేష్ తల్లిని ఓదారుస్తూ... పార్టీకోసం కార్యకర్తలు ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతున్నారు... వారితో పోలిస్తే నేను పడుతున్న కష్టం అంత పెద్దదేం కాదమ్మా... నాకేం కాదంటూ అనునయించారు. పార్టీ కేడర్‌కు లోకేష్ ఎంత ప్రాధాన్యత ఇస్తారనడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం.

## అగ్నిపరీక్ష సమర్థవంతంగా ఎదుర్కొన్న యువనేత

యువగళంతో ప్రజాకంటక పాలనపై అవిశ్రాంత పోరాటం సాగిస్తున్న నారా లోకేష్ పాదయాత్రను ఏవిధంగా అడ్డుకోవాలని కుట్రపన్నిన జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్ 9న పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులు బనాయించి జైలులో పెట్టింది. ఆరోజు తెల్లవారుజామున 4 గంటల సమయంలో కోనసీమలోని రాజోలు నియోజకవర్గం పొదలాడ వద్ద యువగళం శిబిరంపై పోలీసులు బందిపోటు దొంగల్లా విరుచుకుపడ్డారు. యువగళం వాలంటీర్లను అపహరించి సమీపంలోని ఒక రైస్ మిల్లులో నిర్బంధించారు. భీమవరంలో పాదయాత్ర సమయంలో రెచ్చగొట్టి గొడవలు సృష్టించి తిరిగి యువగళం వాలంటీర్లపైనే తప్పుడు కేసులు బనాయించారు. లోకేష్ బస చేసిన శిబిరాన్ని చుట్టుముట్టి అష్టదిగ్బంధనం చేశారు. ఒకపక్క తండ్రి అరెస్టు, మరోవైపు యువగళం వాలంటీర్ల నిర్బంధంతో ఉక్కిరిబిక్కిరైన యువనేత లోకేష్ తాను బసచేస్తున్న శిబిరం వద్దే నేలపై కూర్చుని గాంధేయమార్గంలో ఆందోళనకు దిగారు. తన తండ్రిని చూసేందుకు వెళ్లాలని చెప్పినా అనుమతించకుండా అడ్డుకున్నారు. తనను అనుమతించేవరకు కదిలేది లేదంటూ నిరసనకు దిగడంతో యువనేత తాడేపల్లి వెళ్లేందుకు అనుమతించారు. పాదయాత్రకు తాత్కాలిక విరామం ప్రకటించి న్యాయపోరాటం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడును 53 రోజులపాటు జైలులో ఉంచిన సమయంలో లోకేష్ అగ్నిపరీక్షను ఎదుర్కొన్నారు. ఒకవైపు అధినేతపై పెట్టిన తప్పుడు కేసుల్లో న్యాయపోరాటానికి ఢిల్లీవెళ్లి నిపుణులతో నిరంతర చర్చలు, మరోవైపు రాష్ట్రంలో అక్రమ నిర్బంధానికి గురైన కేడర్‌ను కాపాడుకోవడం, ఇంకోవైపు రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధించిన యువగళం వాలంటీర్లను బయటకు రప్పించేందుకు యువనేత రేయింబవళ్లు పోరాడారు. చంద్రబాబు కోసం ఢిల్లీలో న్యాయపోరాటం చేస్తూనే జైలులో ఉన్న యువగళం కార్యకర్తలను బయటకు తెచ్చేందుకు ప్రత్యేకంగా న్యాయనిపుణులను ఏర్పాటు చేశారు. కొంతకాలం తర్వాత వారిని బెయిల్‌పై బయటకు రప్పించారు. ఈలోగా అవుటర్ రింగ్ రోడ్డులో భూముల కుంభకోణమంటూ తప్పుడు కేసు మోపి లోకేష్‌ను సైతం సిఐడి విచారణకు పిలిచింది. ఏ తప్పూ చేయని లోకేష్ ఏమాత్రం జంకకుండా సిఐడికి సమాధానమిచ్చారు. అన్ని ప్రతిబంధకాలను అధిగమించి పులు కడిగిన ముత్యంలా 79రోజుల సుదీర్ఘ విరామానంతరం యువగళం జైత్రయాత్రను పునఃప్రారంభించి దిగ్విజయంగా గాజువాక శివాజీనగర్‌లో ముగించారు. ఆ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ సాధించబోయే అప్రతిహతమైన విజయాలకు యువగళం పునాదులు వేసిందని చెప్పిన మాటలు ఈ ఎన్నికల్లో నిజమయ్యాయి.



## రాష్ట్ర రాజకీయాల్లో ' 'రెడ్ బుక్'' సంచలనం

సాంప్రదాయ రాజకీయ నాయకులకు భిన్నంగా యువనేత లోకేష్ చేసిన ప్రసంగాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ఒరవడి సృష్టించాయి. యువగళం పాదయాత్ర తర్వాత పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సమాయాత్తం చేసేందుకు శంఖారావం కార్యక్రమం ద్వారా ఉత్తరాంధ్రలోని 31 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రాయలసీమలోని 10అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువనేత సుడిగాలి పర్యటన చేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా యువగళం పేరిట యువతతో సదస్సులు నిర్వహించి ఎన్నికల్లో వారు పోషించాల్సిన పాత్రపై దిశానిర్దేశం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై మాటల తూటాలతో లోకేష్ చేసే ప్రసంగాలు కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపాయి. అధికార పార్టీ వైఫల్యాలు, అవినీతి చర్యలను ఆధారాలతో సహా ఎండగట్టడంతో లోకేష్ ప్రసంగాలు ప్రత్యర్థులను ఇరకాటంలో పడేశాయి. దీనికితోడు తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధించిన వారి వివరాలను పొందుపరుస్తూ లోకేష్ రూపొందించిన రెడ్ బుక్ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. దీనిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టు వరకూ వెళ్లడం వారిలో నెలకొన్న భయాందోళనలకు అద్దంపట్టింది. ఈ విషయంలో తాను ఏమాత్రం తప్పు మాట్లాడటం లేదని, ఎవరైతే అమాయక ప్రజలు, కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధించారో వారిపై అధికారంలోకి వచ్చాక విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. అధికారపార్టీ వత్తిళ్లతో పక్షపాతంతో వ్యవహరించిన పోలీసు అధికారులను రెడ్ బుక్ ఆందోళనకు గురిచేయగా, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో మనోస్థయిర్యాన్ని నింపింది. దీంతోపాటు ఎటువంటి శషభిషలు లేకుండా పార్టీ వాయిస్‌ను తనదైన శైలిలో సూటిగా, సుత్తిలేకుండా లోకేష్ చేసిన ప్రసంగాలు ప్రజలను ఆలోచింపజేశాయి. తాలిబాన్ల మాదిరిగా జగన్ ప్రభుత్వం సాగించిన అరాచకానికి ఎదుర్కోవడంలో లోకేష్ చూపిన తెగువ ప్రజలు, పార్టీ కేడర్‌లో కొండంత ధైర్యాన్ని నింపాయి. మాచర్ల, తాడిపత్రి నియోజకవర్గాల్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పెద్దారెడ్డిలాంటి నరరూప రాక్షసులకు కేడర్ ఎదురొడ్డి నిలబడిందంటే లోకేష్ ఇచ్చిన మనోస్థయిర్యమే ప్రధానకారణం. రాజకీయాల్లో యువతరాన్ని ప్రోత్సహించేలా లోకేష్ సూచనలతో తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు పార్టీని విజయపథంలో నడిపించాయి.

# అస్తమించిన అక్షర సూరీడు

- పట్టుదలకు, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం
- వేలాదిమందికి ఉపాధి కల్పించిన కల్పవృక్షం
- తెలుగుభాష అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన మహనీయుడు
- రామోజీకి టీడీపీ నేతల ఘన నివాళి





అమరావతి(చైతన్యరథం): అలుపెరగని కృషి, పట్టుదల, అంకితభావం, అకుంఠిత దీక్షకు రామోజీరావు పెట్టింది పేరని టీడీపీ నేతలు కొనియాడారు. వేలాది మందికి ఉపాధి కల్పించిన కల్పవృక్షం రామోజీ అన్నారు. తెలుగుభాష అభ్యున్నతికి ఎంతోగానో కృషిచేసిన మహనీయుడు అని శ్లాఘించారు. ఆయన మృతి యావత్ తెలుగు ప్రజలు, పత్రికా రంగానికే తీరని లోటన్నారు.

మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం రామోజీ చిత్రపటానికి నివాళులు అర్పించిన టీడీపీ నేతలు ఆయన సేవలను కొనియాడారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నక్క ఆనంద్‌బాబు, బొండా ఉమామహేశ్వరరావు, శాసనమండలి సభ్యులు పరుచూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు, శాసన సభ్యులు కొండ్రు మురళి, దాట్ల సుబ్బరాజు, ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు లింగారెడ్డి, ఏవి రమణ, ధారునాయక్, ఆనంద్ సూర్య, అఖిల్, హసన్ భాష, కృష్ణ, బుచ్చి రాంప్రసాద్, వద్దులూరి వెంకటేశ్వరరావు, శంకర్ నాయుడు, పార్టీ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు ఘన నివాళులు అర్పించారు.

### చివరి శ్వాస వరకు సమాజ హితం కోసమే: అచ్చెన్నాయుడు

ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చెరుకూరి రామోజీరావు మృతి తనను వ్యక్తిగతంగా చాలా కలచివేసిందన్నారు. రామోజీరావు మరణంతో యావత్ తెలుగుజాతికి, దేశానికి తీరని నష్టం జరిగింది. ఒక సామాన్యమైన కుటుంబంలో పుట్టి, అసామాన్యమైన వ్యక్తిగా ఎదిగిన ఘనత రామోజీరావుకే చెందుతుంది. నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధతతో, అంకితభావంతో పని చేసిన వ్యక్తి రామోజీ. ఎన్నో ఆటు పోట్లు, అవ మానాలను ఎదుర్కొన్నప్పటికీ నమ్మిన సిద్ధాంతాలను వదలకుండా చివరి శ్వాస వరకు సమాజం హితం కోసం పనిచేసిన వ్యక్తి రామోజీరావు. వ్యాపార రంగంలోగాని, పత్రికా రంగంలోగాని, సినీ రంగంలోగాని..ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆ రంగానికే వన్నె తెచ్చారు. వ్యాపార రంగంలో, పత్రిక ఏర్పాటుతో లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన మహోన్నత వ్యక్తి. పత్రికల గురించి ఎవరికీ తెలియని రోజుల్లో ఈనాడు పత్రిక పెట్టడమే కాకుండా ఆ పేపరును తెల్లారుజామున ఐదు గంటలకే మారుమూల గ్రామాలకు పంపి తాజా వార్తలను తెలియజేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు. ఎన్నో టీవీలు, ఛానల్స్ వచ్చినా ఈటీవీని ఒక ప్రామాణికంగా, ఆదర్శంగా తీర్చి దిద్దారు. వైసీపీ పాలనలో ఆయనను అనేక ఇబ్బందులు పెట్టారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా నిజాలను నిర్భయంగా రాసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవాన్ని నిలబెట్టేందుకు రామోజీరావు కృషి చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో రామోజీరావు చిత్ర పటాలు పెట్టి నివాళి అర్పించాలని నిర్ణయించాం. ఈ మేరకు రాష్ట్ర పార్టీ తరపున ఆదేశాలు జారీచేశామని అచ్చెన్నాయుడు చెప్పారు.

### రామోజీ సేవలు మరువలేనివి: వర్ల

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ 1936తో కృష్ణా జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి నేడు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న చెరుకూరి రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు అన్నారు.. పత్రికారంగంలోగాని, సినీరంగంలో గాని ఆయపేరు సువర్ణాక్షరాలతో లిఖించవచ్చు. మొదటి నుండీ ఆధునిక భావాలతో ప్రపంచీకరణకు కృషి చేసిన మహానుభావుడు. ఈనాడు పత్రిక పత్రికారంగానికే తలమానికం. ఈనాడు మీడియా ద్వారా నిజాలను నిర్భయంగా ప్రసారం చేసి సమాజాన్ని చైతన్యం చేశారు. ఈనాడు ముందడుగు ద్వారా సమాచార హక్కు చట్టాన్ని సామాన్యులకు చేరువ చేశారు. సుజలాం, సుఫలాం అంటూ పరిశుభ్రత కోసం ఊరూవాడా చైతన్యం వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. తెలుగుజాతికి ఆయన సేవలు మరువలేనిదని వర్ల కొనియాడారు.

### తెలుగుజాతికి గర్వ కారణం: బొండా

టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు జాతికి గర్వకారణమైన వ్యక్తి రామోజీరావు అన్నారు. ఎంతో చిన్న కుటుంబంలో పుట్టినా తన రెక్కల కష్టంతో పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించిన వ్యక్తి రామోజీరావు. విలువలకు పట్టంకట్టి, విలువలకు ప్రాధన్యతను ఇచ్చే ఈటీవీ, ఈనాడు పత్రికలను ఏర్పాటు చేసి తెలుగువారి ఖ్యాతిని దశదిశలా వ్యాపించిన వ్యక్తి నేడు లేకపోవడం తెలుగు జాతికి పూడ్చలేని లోటు. మా నాయకుడు చంద్రబాబు ఢిల్లీనుండి హుటాహుటీన వచ్చి రామోజీ భౌతిక కాయానికి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలందరం ఘన నివాళి అర్పిస్తున్నాం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని బొండా కోరుకున్నారు.

## తెలుగు సమాజానికి తీరని వెలితి

తెలుగు సమాజాన్ని ఐదు దశాబ్దాల పాటు ప్రభావితం చేసిన చెరుకూరి రామోజీరావు ఇకలేరు. తెలుగు వారి మీద ఆయన ముద్ర ప్రగాఢమైంది. 1974లో ఆయన ప్రారంభించిన ఈనాడు దినపత్రిక తెలుగువారి జీవనంలో అంతర్భాగమైంది. ఈ ఏడాది స్వర్ణోత్సవం జరుపుకుంటున్న ఈనాడు తెలుగు వారికి అన్ని సమయాల్లో అండగా నిలిచింది.

ఒక వ్యకి కాదు, వ్యవస్థ అనే మాట రామోజీరావుకి వర్తించనంతగా బహుశా మరెవరికీ వర్తించదు. ఆయన వ్యాపార సామ్రాజ్యం బహుముఖంగా విస్తరించింది. రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర నుంచి ప్రియ ఫుడ్స్ వరకు వివిధ రంగాల్లో ఆయన విజయవంతంగా వ్యాపారాలు నిర్వహించారు. ఏ పనిచేసినా చిత్తశుద్ధితో క్రమశిక్షణతో, నూతనత్వంతో చేయటం ఆయన ప్రత్యేకత.



ఎన్ని వ్యాపారాలు చేసినా రామోజీరావు మనసుకి దగ్గరైనది ఈనాడు పత్రికే. ఆయన తన దైనందిన కార్యకలాపాల్లో ఎక్కువ భాగాన్ని ఈనాడు నిర్వహణకే వినియోగించేవారు. దాదావు 50 ఏళ్ల పాటు ఉదయాన్నే 5 గంటలకు లేచి తాజాగా ప్రెస్ నుంచి వచ్చిన పేపర్లో ప్రతి అక్షరాన్ని చదివి, తన కామెంట్లని రాయటం ఆయనకు నిత్యకృత్యమైంది.

ఈనాడు అప్పటికీ ఇప్పటికీ నెంబర్ దినపత్రికగా వెలుగొందుతుందంటే దానికి కారణం ఆయన నిరంతరంగా చేసిన శ్రమ. ఈనాడు అంటే ఇవాళ తెలుగువారి నడుస్తున్న చరిత్రకి దర్పణం. ఎటువంటి ప్రలోభాలకి లొంగకుండా తెలుగు వారి సంక్షేమమే ధ్యేయంగా నడుస్తున్న పత్రిక. ఇందిరాగాంధీని ఎదిరించినా, ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశాన్ని ఆహ్వానించినా, చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి హితం బోధించినా, వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీసినా రామోజీరావు కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడే పత్రికను నడిపారు.

తెలుగునాట ఆయన తనకున్న పలుకుబడిని తన సొంత ప్రయోజనాలకు ఏనాడూ ఉపయోగించుకోలేదు. ఏ ప్రభుత్వంలోనూ పదవులు ఆశించలేదు. ఏ ప్రయోజనాలనూ కోరలేదు. రాజ్యసభ సభ్యుడిగా పంపాలని ఎన్టీఆర్ కోరుకున్నా రామోజీరావు సున్నితంగా తిరస్కరించారు. ఆయన తన వ్యాపారాల కోసం ప్రభుత్వాలని ఎప్పుడూ ఏదీ కోరలేదు.

అందుకే మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, మార్గదర్శి చిట్‌ఫండ్స్ మీద ఈ మధ్య వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారాన్ని దుర్వినియోగం చేసి దాడులకి తెగబడినా ఆయన వెనకాడలేదు. రాజీ పడలేదు. అంత గుండె స్థైర్యం, నిబద్ధత, రాజీపడని వైఖరి సమకాలీన చరిత్రలో మరొకరు ప్రదర్శించలేదు. ఆయన మీద తెలుగు ప్రజలకి అపార విశ్వాసం. ఎవరెన్ని అభాండాలు వేసినా, వారి నమ్మకం సడలలేదు. కాబట్టే, ఆయన కంపెనీలని కూలదోయాలన్న కుట్రలు ఫలించలేదు.

ఎన్ని వ్యాపారాలు చేసినా, ఆర్థికంగా ఎంత ఎదిగినా, తెలుగు భాష అంటే అయనకున్న మక్కువ తగ్గలేదు. ఈటీవీ ద్వారా తెలుగు భాష, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిది. రైతుల కోసం అన్నదాత, పిల్లల కోసం బాలభారతి, భాషాభివృద్ధి కోసం తెలుగు వెలుగు, ఇంకా విపుల, చతుర - ఇలా వివిధ పత్రికలని భాషాసేవలో భాగంగా లాభాపేక్ష లేకుండా నడిపారు.

ఆయన తెలియని తెలుగువారుండరు. అయినా రామోజీరావు సభలకి, సన్మానాలకి, వ్యక్తిగత భేషజాలకి దూరం. పొగడ్తలని, తెగడ్తలని ఒకే విధంగా తీసుకోగల స్థితప్రజ్ఞుడు. తన కంటే తాను చేసే పనే ముఖ్యం అని నమ్మినవాడు.

రామోజీరావుది ధన్యజీవితం. ఆయన మృతి తెలుగు సమాజానికి తీరని వెలితి.

## ప్రభుత్వ లాంఛనాలతో రామోజీ అంత్యక్రియలు

### తెలంగాణ సర్కారు నిర్ణయం

మీడియా దిగ్గజం రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ప్రస్తుతం సీడబ్ల్యూసీ సమావేశాల కోసం ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ అక్కడి నుంచే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఓ మీడియా దిగ్గజానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనుండటం దేశంలో ఇదే తొలిసారి.

## రాష్ట్రంలో రెండు రోజులు సంతాపదినాలు

### రామోజీ అంత్యక్రియలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముగ్గురు అధికారులు

అమరావతి: రామోజీగ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు అంత్యక్రియలకు ఏపీ ప్రభుత్వం తరపున ముగ్గురు సీనియర్ అధికారులు హాజరు కానున్నారు. ఆదివారం ఉదయం నిర్వహించనున్న అంత్యక్రియల కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధులుగా ఆర్పీ సిసోదియా, సాయిప్రసాద్, రజత్ భార్గవ హాజరు కానున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పార్థివదేహంపై అధికారులు పుష్పగుచ్ఛం సమర్పించి నివాళి అర్పించనున్నారు. రామోజీరావు మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ ఏపీ ప్రభుత్వం 9, 10 తేదీలను సంతాప దినాలుగా ప్రకటించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండ్రోజుల పాటు జాతీయ పతాకాన్ని సగం వరకూ అవనతం చేయాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారికంగా ఎలాంటి వేడుకలు నిర్వహించరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# తెలుగు వెలుగు రామోజీ

## ఆయన మృతి తీరని లోటు: చంద్రబాబు

అమరావతి: ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయంపై టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని.. కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన మరణం రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా తీరని లోటని చంద్రబాబు అన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం అని పేర్కొన్నారు. ఈనాడు గ్రూపు సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేకమైన శకం అని చంద్రబాబు కొనియాడారు. ఎన్నో సవాళ్లను, సమస్యలను అధిగమించి... ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం రామోజీరావు పనిచేశారని అన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరమని, ఆయన ఇక లేరు అనే విషయాన్ని తాము జీర్ణించుకోలేకపోతున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

రామోజీరావుతో తన 4 దశాబ్దాల అనుబంధాన్ని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మంచిని మంచి, చెడును చెడు అని చెప్పే ఆయన తీరు.. తనను ఆయనకు ఎంతో దగ్గర చేసిందని అన్నారు. సమస్యలపై పోరాటంలో ఆయన తనకు ఒక స్ఫూర్తి అని కొనియాడారు. ప్రజలకు మంచి పాలసీలు అందించే విషయంలో తాను రామోజీ సూచనలు, సలహాలు తీసుకునేవాడినని గుర్తు చేసుకున్నారు. రామోజీ అస్తమయంపై ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రబాబు ప్రార్థించారు.



### రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం: అచ్చెన్నాయుడు



అమరావతి:రామోజీ గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి పట్ల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయం కృషితో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు అన్నారు. ఈనాడు దినపత్రిక స్థాపించి తెలుగు పత్రికా ప్రపంచంలో నవ శకానికి నాంది పలికారు. ఈనాడు మీడియా సంస్థ ద్వారా నిజాలను నిర్భయంగా ప్రసారం చేసి సమాజాన్ని చైతన్యం చేశారు. ఈనాడు ముందడుగు ద్వారా సామాన్యులకు చేరువగా సమాచార హక్కు చట్టం, సుజలాం, సుఫలాం అంటూ పరిశుభ్రత కోసం ఊరూవాడా చైతన్యం వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగుజాతికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు అచ్చెన్నాయుడు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### మీడియా, వినోద ప్రపంచంలో చెరగని ముద్ర

#### రామోజీరావు మృతిపై ప్రధాని మోదీ సంతాపం



న్యూఢిల్లీ: మీడియా మొఘల్ రామోజీరావు మృతిపై ప్రధాని నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. 'ఎక్స్'(ట్విట్టర్) వేదికగా రామోజీ మృతిపై మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. రామోజీరావు మృతి చాలా బాధాకరం. ఆయన భారతీయ మీడియాలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చిన దార్శనికుడు. జర్నలిజం, చలన చిత్ర ప్రపంచంపై చెరగని ముద్రవేసిన మహనీయుడు. మీడియా, వినోద ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలతో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. రామోజీరావు భారతదేశ అభివృద్ధి పట్ల ఎంతో మక్కువ చూపేవారు. పలు సందర్భాల్లో ఆయనతో మాట్లాడి కొంత జ్ఞానం పొందే అవకాశం లభించడం నా అదృష్టం. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అసంఖ్యాక అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

### రామోజీరావు మరణం తీవ్రంగా కలచివేసింది: యనమల రామకృష్ణుడు



అమరావతి: నిజాలను ప్రజలకు చేరవేయాలి, ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేసేలా ఉండాలని తపించే ఏకైక వ్యక్తి చెరుకూరి రామోజీరావు మరణం అత్యంత బాధాకరమని శాసనమండలి టీడీపీ పక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. ఎక్కడో చిన్న రైతు కుటుంబంలో పుట్టి అచంచలమైన కష్టంతో ప్రపంచం మెచ్చే వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన తీరు అనితర సాధ్యం. ఎన్నో ఆటుపోట్లు.. మరెన్నో అవమానాలు అన్నింటినీ ఎదురొడ్డి, రామోజీరావు ఈస్థాయికి చేరారు. వాస్తవాలు మాత్రమే ప్రజలకు తెలియాలని ఈనాడు అనే మీడియా వ్యవస్థను స్థాపించి.. ప్రజలకు తోడుగా నిలిచారు. మార్గదర్శి చిట్ ఫండ్, ప్రియా ఫుడ్స్,కళాంజలి లాంటి ఎన్నో వ్యాపార సంస్థల్ని స్థాపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటుచేశారు. అతి తక్కువ సమయంలోనే జాతీయస్థాయి నెట్‌వర్క్‌గా ఈటీవీని విస్తరింపచేశారు. తెలుగునాట ఎన్ని వార్తా పత్రికలొచ్చినా, ఎన్ని టీవీ ఛానళ్లు వచ్చినా.. నిజనిర్ధారణ కోసం చూసే ఏకైక న్యూస్ నెట్‌వర్క్‌గా ఈనాడు, ఈటీవీని రూపుదిద్దారు. రామోజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం. ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగుజాతికి తీరని లోటని యనమల అన్నారు.

### తెలుగు సమాజానికి తీరని లోటు: లోకేష్



అమరావతి:రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ప్రజా పక్షపాతి, అలుపెరుగని అక్షర యోధుడికి కన్నీటి నివాళులు అర్పిస్తున్నానని పేర్కొన్నారు. జనహితమే తన అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన రామోజీరావు మనకు మార్గదర్శి. ప్రజాస్వామ్య పరిరక్షణకు రామోజీరావు ఉద్యమస్ఫూర్తితో పని చేశారని లోకేష్ కొనియాడారు.

### రామోజీ జీవితం అందరికీ ఆదర్శం: టీడీ జనార్ధన్



అమరావతి: పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో తనదైన ముద్రవేసి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేసిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగిన రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారన్నారు. ఈనాడు పత్రిక స్థాపన ద్వారా మీడియా రంగంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. రామోజీరావు మృతి తెలుగువారికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### అలుపెరుగని కృషీవలుడు రామోజీరావు

**- టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి**



అమరావతి: అలుపెరగని కృషి, పట్టుదల, అంకితభావం, దృఢదీక్ష, పోరాటపటిమ, ప్రజాస్వామ్య పరిరక్షణలకు రామోజీరావు పర్యాయపదం అని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి అన్నారు. వేలాదిమందికి ఉపాధి కల్పించిన కల్పవృక్షం. తెలుగుభాష అభ్యున్నతికి ఎంతోగానో కృషిచేశారు. పాడుతా-తీయగా లాంటి కార్యక్రమాలతో ఎంతోమంది మట్టిలో మాణిక్యాలను వెలితీశారు. అతిపెద్ద ఫిల్మ్ సిటీని నిర్మించారు. మార్గదర్శి ద్వారా లక్షలాది మంది ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందించారు. అక్షరాస్యత ఉద్యమానికి ఈనాడు ఎంతగానో తోడ్పడింది. వ్యాపారంలో సమాజహితం గురించి ఆలోచించిన మహోన్నత వ్యక్తి. రామోజీ జీవితం భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలి. రామోజీ రావు స్మృతికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పించాలి. రామోజీ రావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థన. వారి కుటుంబ సభ్యులకు మాల్యాద్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### రామోజీరావుకి అశ్రు నివాళి: బాలకృష్ణ



అమరావతి: తెలుగు పత్రికా రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన రామోజీ రావు మృతికి సినీనటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అశ్రునివాళి అర్పించారు. తెలుగులోనే కాదు దేశ పత్రికా రంగంలోనే ఓ కొత్త ఒరవడిని సృష్టించి భావితరాల పత్రికా ప్రతినిధులకు రామోజీ మార్గదర్శిగా నిలిచారన్నారు. తెలుగు నుడికారానికి ఒక కొత్త కళను తెచ్చారు. జర్నలిజానికి కొత్త సొబగును దిద్దారు. చిత్రసీమలోనూ అదే తీరున సాగి ఉషోదయ కిరణాలను ప్రసరింప చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడియోగా రామోజీ ఫిలిం సిటీని తెలుగు నేలపై నెలకొల్పారు. ఏది చేసినా తనదైన బాణీ చూపిస్తూ సాగిన రామోజీరావు ఇక లేరు అన్న వార్త ఆవేదన కలిగిస్తోంది. మా తండ్రి నందమూరి తారక రామారావుతో ఆయన అనుబంధం ప్రత్యేకమైనది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ., ఆయన కుటుంబ సభ్యులకు బాలకృష్ణ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### జనహితమే రామోజీ అభిమతం: వేపాడ



అమరావతి: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు స్వయంకృషితో అత్యంత ఉన్నత స్థితికి చేరి తెలుగువారి చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్నారని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. రామోజీరావు అంతిమ శ్వాస విడవడం అత్యంత విచారకరమన్నారు. ఈనాడు పత్రికతో ప్రస్థానం ప్రారంభించిన ఆయన తెలుగు పత్రికారంగానికి దశాబ్దాలుగా ఎనలేని సేవలందించారు. ప్రజా పక్షపాతిగా, జనహితమే అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పనిచేసారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమస్ఫూర్తితో పని చేశారు. అలుపెరుగని అక్షర యోధుడికి కన్నీటి నివాళులు అర్పిస్తూ..వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. రామోజీరావు కుటుంబానికి చిరంజీవిరావు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# అవిశ్రాంత శ్రామికుడి మహాభి నిష్క్రమణ


రెడ్డిగూడెంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు


సత్యవేడులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ కార్యకర్తలు


సూళ్ళూరుపేటలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు


తిరుపతిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న గొల్ల నరసింహయాదవ్


తిరుపతిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ


ఉదయగిరిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు


వెంకటగిరిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ


విజయవాడలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు


వింజమూరులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ కార్యకర్తలు


రామోజీ సంస్థల అధినేత రామోజీరావు మరణానికి చింతిస్తూ... రామోజీ ఫిల్మ్ సిటీలోని ఆయన స్వగృహంలో పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి.


విజయవాడలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు


రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి దేవినేని ఉమా

## - రామోజీ ఫిలింసిటీలో రామోజీరావుకు నివాళులర్పించిన ఆళ్ళ

హైదరాబాద్ (చైతన్యరథం): ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మభూషణ్ చెరుకూరి రామోజీరావు మృతి రెండు తెలుగు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు తీరని లోటని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు అన్నారు.

శనివారం హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలోని కార్పొరేట్ కార్యాలయంలో చెరుకూరి రామోజీరావు పార్థివదేహానికి పూలమాలవేసి ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడు తూ... కృష్ణాజిల్లా పెదపారపూడిలో రైతు కుటుంబంలో జన్మించిన రామోజీరావు అంచెలంచెలుగా ఎదిగి ఈనాడు, ఈటీవీ రామోజీఫిలిం సిటీ వంటి సంస్థల ద్వారా వేలాదిమంది యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిం చారని, ఈనాడు ద్వారా పాఠకులకు ధైర్యంగా నిజాలను అందించి మంచి సమాజాన్ని తయారు చేయటానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.

ఆళ్ళతో పాటు రామోజీరావుకు నివాళులర్పించిన వారిలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు తదితరులు ఉన్నారు.



# అస్తమించిన అక్షరయోధుడికి ఘన నివాళి


ఒంగోలులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్


అనంతపురంలో నివాళులర్పిస్తున్న కాల్వ శ్రీనివాసులు

అంధకారంలో మగ్గిన ఎన్నో జీవితాల్లో ఆ ఆలోచనాసమాహారం వెలుగులు నింపింది. మట్టిలో మాణిక్యాలెన్నింటినో ఉన్నత శిఖరాలకు చేర్చింది. రాజ్యాన్ని ఏలే రాజకీయరంగమైనా, తారలు తళుక్కుమనే వినోద ప్రపంచమైనా, ప్రశ్నించే గొంతుకల పాత్రికేయలోకంలోనైనా ఎంతో మందిని నూతన శిఖరాలకు చేర్చిన మహాయోధుడు రామోజీరావు" మీడియా మొఘల్, ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు (88) శనివారం తెల్లవారుజామున 4.50 నిముషాలకు ఈ లోకం నుంచి మహాభి నిష్క్రమించారు. ఆయన లేరన్న వార్త రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రామోజీ లేనిలోటు ఎప్పటికీ పూడ్చలేనిదని, రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



భీమడోలులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న గన్నీ వీరాంజనేయులు


భీమవరంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న మంతిన రామరాజు


ఎమ్మిగనూరులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు


దర్శిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న గొట్టిపాటి లక్ష్మీ


గన్నవరంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ కార్యకర్తలు


గిద్దలూరులో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



హనుమంతునిపాలెంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న శ్రేణులు


జగ్గయ్యపేటలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు తాతయ్య, సౌమ్య



కందుకూరులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు


కనిగిరిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు


ఆలూరిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు


మాచర్లలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు

# కలం సైనికుడికి కడసారి ఘన వీడ్కోలు


మండపేటలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ, తదితరులు


నందిగామలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య


నంద్యాలలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్ ఎమ్ డీ ఫరూక్


పెనమలూరులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్


మంత్రాలయంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


నెల్లూరులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు



మార్కాపురంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు


నిడదవోలులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు


పి. గన్నవరం లంబాజీపేటలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు


పాణ్యంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


పత్తికొండలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ కార్యకర్తలు



మదనపల్లిలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు


పెనమలూరులో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ కార్యకర్తలు


మల్కిపురంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు


రావులపాలెంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు

# కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయాం

- రామోజీరావు మృతి 2తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు
- మా కుటుంబానికి వ్యక్తిగతంగా చాలా నష్టం జరిగింది
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆవేదన
- పరిటాల శ్రీరామ్ తో కలసి రామోజీరావు కు ఘనంగా నివాళి



రాప్తాడు (చైతన్యరథం): రామోజీరావు మృతి 2తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని.. వ్యక్తిగతంగా మాకుటుంబానికి చాలా నష్టం అని మాజీ మంత్రి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణించిన విషయం తెలుసుకున్న వెంటనే వారు హైదరాబాద్ లోని రామోజీఫిలిం సిటీకి వెళ్లారు. అక్కడ రామోజీరావు పార్థివ దేహాన్ని చూసిన సునీత కన్నీరు పెట్టుకున్నారు. సునీత, శ్రీరామ్ ఇద్దరూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చాలా సేపు అక్కడే ఉండిపోయారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ మాకుటుంబం ఒక పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. ఎప్పుడు వచ్చినా.. ఎంతో అప్యాయంగా పలుకరించే వారన్నారు. మాకు ఏ కష్టం వచ్చినా ఆయన వద్దకు వెళ్లేవారమని.. ఆయన చెప్పే ధైర్యం, సూచనలు ఎంతో బలాన్నిచ్చేవన్నారు. అలాంటి వ్యక్తి మరణించారంటే.. రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశం మొత్తం ఆవేదనతో నిండిపోయిందన్నారు. దేశ వ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధినిచ్చిన వ్యక్తి రామోజీరావు అన్నారు. ఆయన ఆశయాలను వారి కుటుంబ సభ్యులు కొనసాగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు శ్రీరామ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ ప్రజలకు కష్టం వచ్చిన ధైర్యంగా స్పందించిన వ్యక్తి రామోజీరావు అన్నారు. మాలాంటి వారికి ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపించే విధంగా పత్రిక, మీడియాను స్థాపించారన్నారు. ఎన్నో అభ్యుదయ భావాలతో, వినూత్నమైన ఆలోచనలతో సమాజం కోసం పని చేశారన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఆయన మరణం తీరని లోటుగా భావిస్తున్నామన్నారు. ఆయన అలోచనలు రాబోయే తరాలకు, మంచి సమాజ స్థాపనకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

# రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు

- టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో రామోజీరావు చిత్రపటానికి నివాళులు
- రామోజీరావు కుటుంబానికి సానుభూతి తెలియజేసిన టీడీపీ నాయకులు



మంగళగిరి (చైతన్యరథం): తెలుగు ప్రజల జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేసిన రామోజీరావు తెలుగు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య అన్నారు. టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రామోజీరావు కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య మాట్లాడుతూ మంచి దార్శకుని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి పత్రికారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. రామోజీఫిల్మ్ సిటీ ప్రపంచంలోనే గర్వంగా చెప్పుకునే మన తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అతి పెద్ద స్టూడియో అని చెప్పారు. వివిధ ఛానల్స్, మార్గదర్శి, ప్రియా ఫుడ్స్ ఇలా ఎన్నో సంస్థల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పించారన్నారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు మాట్లాడుతూ... వ్యాపారవేత్తగా, మీడియా వ్యవస్థాపకుడిగా, చలనచిత్ర నిర్మాతగా, రామోజీరావు సేవలు అనిర్వచనీయమన్నారు. రామోజీరావు అంచెలంచెలుగా ఎదిగి ఎంతో మందికి జీవనోపాధి కల్పించారని అన్నారు. పత్రికను మారుమూల గ్రామాలకు సైతం చేర్చి స్థానిక వార్తలకు ప్రాధాన్యం కల్పించారని కొనియాడారు. ఆయన మరణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు తీరని లోటని అన్నారు.

నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు మాట్లాడుతూ... పత్రికా రంగం ద్వారా ప్రజలకు సామాజిక న్యాయం చేసేందుకు కృషి చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు.

పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ మాట్లాడుతూ... రామోజీరావు తెలుగు భాష, జర్నలిజానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. 88ఏళ్ల వయస్సులోనూ క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన నడుచుకునే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పేరం శ్రీనివాసరావు, రంగిశెట్టి బాబీ, బుల్లా కోటి, మల్లెల నాగయ్య, పొన్నెగంటి పూర్ణచంద్రరావు, షేక్ నజీర్, తాడిబోయిన మహేష్, మునగపాటి ప్రసన్న వెంకటేశ్వరరావు, తాడిబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అరాచక పాలనపోయి అభివృద్ధి పాలన మొదలైంది

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

పల్నాడు (చైతన్యరథం): జగన్ ఓడిపోయాక ఈ రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిందని ప్రజలు భావిస్తున్నారని, జూన్ 4తో అరాచక పాలనపోయి అభివృద్ధి పాలన మొదలైందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం శుభపరిణామని, స్వాతంత్రం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఇంత భారీ విజయం లేదన్నారు. చంద్రబాబు గతంలో చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తుంచుకున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు ఉండాలనేదే టీడీపీ సంకల్పమని, పల్నాడు జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలును గెలిపించి మమ్మల్ని ప్రజలు ఆదరించారని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పుతో మా మీద మరింత బాధ్యత పెరిగిందన్నారు. వైసీపీ శ్రేణుల కవ్వింపు చర్యలకి దిగినా టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలని అన్నారు. జిల్లాలో గంజాయి, గుట్కాపై రెండు నెలల్లో కఠిన చర్యలు తీసుకుంటామని, వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడమే మా ధ్యేయం అని అన్నారు. గతంలో జిల్లాలోని వైసీపీ నేతలు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, మా ప్రభుత్వంలో జిల్లాలో శాంతి భద్రతల సమస్య ఎక్కడ రాకూడదన్నారు. దేశంలో మచ్చ లేని నాయకుల్లో చంద్రబాబు ఒకరని, రాబోయే రోజుల్లో దేశ రాజకీయాల్లో చంద్రబాబు కీలక పాత్ర పోషించ బోతున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం చేతకానీ తనంతోనే రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు పూర్తి కాలేదని, ప్రభుత్వ కార్యాలయాలను ప్రజా పరిపాలన వేదికలుగా మారుస్తామని అన్నారు.



అమరావతి, పోలవరం ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి, వరికపుడిసెల పనులు పూర్తి చేసి పల్నాడు ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు.

**రామోజీ అస్తమయం దిగ్భ్రాంతి కలిగించిది : జీవీ ఆంజనేయులు**

రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని జీవీ ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని అన్నారు.

## అక్షర యోధునికి అశ్రు నివాళు లర్పించిన గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమండ్రిరూరల్ (చైతన్యరథం): ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, మీడియా మొఘల్, పద్మవిభూషణ్ రామోజీరావు మరణం పట్ల రాజమండ్రి రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈరోజు శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసం నందు టీడీపీ నాయకులతో కార్యకర్తలతో కలిసి గోరంట్ల రామోజీరావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ తెలుగు భాషకు రామోజీరావు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేని అని రామోజీ మృతి తెలుగు వారు అందరికీ తీరని లోటు అని గోరంట్ల భావోద్వేగమయ్యారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి ఒక అంచలం చెలుగా ఎదిగి అక్షర యోధుడుగా,ఒక మార్గదర్శిగా నిజాయితీ విలువలతో కూడిన జర్నలిజంతో తెలుగువారి గుండెల్లో ఆయన ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని అలాంటి మహా యోధుడు మన మధ్య లేకపోవడం బాధాకరమని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి యర్ర వేణుగోపాల్ రాయుడు, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు,రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి,రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్,గంగిన హనుమంత రావు, నున్న కృష్ణ,ఆళ్ల ఆనందరావు,యార్లగడ్డ శేఖర్, సింగ్ సురేంద్ర, కోరాడ వెంకటేష్, ఎమ్.ఎస్ శ్రీను,రాయుడు సునీల్,పసలపూడి పాపారావు, ఆళ్ల విఠల్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు సమస్య పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టాలి

- అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక 11వ డివిజన్లో నెలకొన్న సమస్యలకు సత్వరం పరిష్కారం చూపించాలని నగర పాలక సంస్థ అధికారులను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆదేశించారు. సదరు డివిజన్లో గతంలో చేపట్టిన మేజర్ డ్రైనేజీని స్థానిక టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సదరు ప్రాంతంలో ముంపు, మురుగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్టును వెంటనే తీయించా లని, ఇంకా మిగిలిపోయిన పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేసి స్థానిక ప్రజలకు డ్రైనేజీ పరంగా ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. స్థానిక పెద్దలు అంకం గోపి, డివిజన్ ఇన్చార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్, అడబాల రాజా, రేగేటి సూరిబాబు, జాజుల గోవిందరాజులు, తోట కిరణ్, సత్యవేణి, రేలంగి శ్యామ్, గరికి రామారావు, నున్న నాగమణి, దేవి, బద్రి, కేబుల్ ప్రభాకర్, కోర్పు రామారావు, భవానీ, బాబురావు తదితరులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంట ఉన్నారు.

## నిత్యకృషీవలుడి నిర్యాణం బాధాకరం

- వీరంకి వెంకట గురుమూర్తి నివాళి



అమరావతి (చైతన్నరథం): అలుపెరగని కృషి, పట్టుదల, అంకిత భావం, పోరాటపటిమ, ప్రజాస్వామ్య పరిరక్షణల కోసం నిత్యం శ్రమించిన రామోజీ రావు మనల్ని విడిచి వెళ్లడం అత్యంత బాధాకరమని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిమందికి ఉపాధి కల్పించిన కల్పవృక్షం రామోజీ రావు అన్నారు. తెలుగుభాష అభ్యున్నతికి చేసిన కృషి అనిర్వచనీయం. ప్రపంచంలోనే రెండవ స్థాయి కలిగిన ఫిల్మ్ సిటీని నిర్మించి తెలుగు నేలకు ప్రపంచ గుర్తింపు తీసుకొచ్చారు. మార్గదర్శితో లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారు. అక్షరాస్యత ఉద్యమానికి ఈనాడు ఎంతగానో తోడ్పడింది. వ్యాపారంలో సమాజహితాన్ని జోడించిన మహోన్నత వ్యక్తి రామోజీ. దశాబ్దాలు గడిచినా తన వార్తల్లో ఎలాంటి మార్పులు లేకుండా, నీతి నిజాయితీలనే నమ్ముకున్న ఏకైక మీడియా అధిపతిగా కీర్తి గడించారు. ప్రజా పక్షపాతిగా, జనహితమే తన అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పనిచేశారు.

# తెలుగుజాతి వెలుగు పెంచిన కారణజన్ములు రామోజీరావు

## రామోజీరావు భౌతికకాయానికి నివాళులర్పించిన టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట / హైదరాబాద్ (చైతన్యరథం):** తెలుగుజాతి వెలుగులు పెంచిన కారణజన్ములు.... ఈనాడు గ్రూపు సంస్థల అధినేత పద్మ విభూషణ్ రామోజీరావు అని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. తెలుగుజాతి సగర్వంగా మావాడని చెప్పుకునే మీడియా మొఘల్ రామోజీరావు అస్తమయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ తీరని లోటని, తెలుగు తల్లి మరో కొడుకును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రామోజీరావు మరణవార్త విన్నవెంటనే ప్రత్తిపాటి హైదరాబాద్ వెళ్లారు. రామోజీ ఫిల్మ్ సిటీలో రామోజీరావు పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘన నివాళులర్పించారు. అనంతరం రామోజీరావు కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... జర్నలిజం, సినీ రంగాలతో పాటు వివిధ వ్యాపారాలు, ప్రత్యేకించి తెలుగు భాష కోసం రామోజీరావు చేసిన కృషిని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. కృష్ణా జిల్లాలో ఒక చిన్నగ్రామం, సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి అసాధారణ స్థాయికి చేరిన బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు అని, ఆయన జీవితం భావితరాలకి ఒక స్ఫూర్తి పాఠం అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, స్వయంకృషితో ఎవరు ఏ స్థాయికైనా చేరవచ్చనదానికి రామోజీరావు ఎప్పటికీ ఒక ఉదాహరణగా నిలిచిపోతారని.. అలాంటి వ్యక్తి ఆకస్మిక మరణంతో ఆయన కుటుంబంతో పాటు తెలుగుజాతే ఇంటిపెద్దను కోల్పోయినంత బాధగా ఉందన్నారు. తెలుగు నాట తరాలను ప్రభావితం చేసిన కలం విరామం తీసుకుందన్నారు. కలం బాట పట్టి అక్షర సేద్యం చేసిన యోధుడు విశ్రాంతి తీసుకుంటున్నారని అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం, సమాజంలో సత్య రక్షణ కోసం, సస్యవిప్లవం కోసం రామోజీరావులా సేవలు అందించిన వ్యక్తి మరొకరు లేరని, రారు అనడంలోనూ అతిశయోక్తి లేదని, ఈ కష్టసమయంలో ఆయన కుటుంబ సభ్యులు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బంది అందరికీ ఆ భగవంతుడు తోడుగా ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

# 20 ఏళ్ల తర్వాత నరసరావుపేటలో ఎగిరిన టీడీపీ జెండా

- అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించి పనిచేసిన మన్నవ మోహనకృష్ణ
- ప్రత్యేకంగా అభినందించిన టీడీపీ యువనేత నారా లోకేష్



**గుంటూరు (చైతన్యరథం)** : 20 ఏళ్ల అనంతరం నరసరావుపేట నియోజకవర్గంలో టీడీపీ జెండా రెపరెపలాడిందని, టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు విజయానికి నియోజకవర్గ పరిశీలకుడిగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విశేషమైన కృషి చేశారని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అభినందించారు. గత శుక్రవారం ఉండవల్లి నివాసంలో లోకేష్‌ను కలిసిన మన్నవ... పార్టీ అఖండ విజయం సాధించడం పట్ల శుభాకాంక్షలు తెలియజేశారు. నరసరావుపేట, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం మోహనకృష్ణ అహర్నిశలు శ్రమించి మంచి మెజారిటీతో గెలిచేలా పని చేశారని, వారి సేవలను మరవలేమని లోకేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అనంతరం మన్నవ మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో టీడీపీ అసాధారణ విజయానికి దోహదం చేసిన ప్రధాన అంశాల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేష్ చేసిన సుదీర్ఘ పాదయాత్ర ఎంతో కీలకమైందన్నారు. వైసీపీ అరాచకాలను ఎండగట్టడం, టీడీపీని మరింతగా ప్రజలకు చేరువ చేయడం, పార్టీలో యువనాయకత్వాన్ని పెంపొందించడం లక్ష్యంగా చేపట్టిన పాదయాత్రకు విశేషమైన స్పందన లభించిందన్నారు. 226 రోజుల పాటు 11 ఉమ్మడి జిల్లాల్లోని 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా జరిగిన యాత్రలో లోకేష్ 3,132 కి.మీ లు నడిచారని తెలిపారు. గత ఐదేళ్లుగా నారా లోకేష్ ఎన్నో రకాల విమర్శలను ఎదుర్కొన్నారని, మంగళగిరిలో ఓటమి పాలయ్యారంటూ వైసీపీ నేతలు అయనను ఎన్నో విధాలుగా అవమానించారు. వాటన్నింటికీ నారా లోకేష్ తన విజయంతో సమాధానం చెప్పారని మోహనకృష్ణ వెల్లడించారు. తానేమీ తన కంచుకోట నుంచి పోటీ చేయడం లేదని.. టీడీపీ వీక్‌గా ఉన్న స్థానం నుంచి పోటీ చేశానని.. తిరిగి అదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తానని లోకేష్ పలుమార్లు చెప్పారని, ఇప్పుడు 91 వేల మెజారిటీతో ఆయన సాధించిన విజయం వైసీపీకి చెంపపెట్టు అని మోహనకృష్ణ తెలిపారు.

# పార్టీ గెలుపులో ధర్మవరం సుబ్బారావు సేవలు ఎనలేనివి



- శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన పి. నారాయణ

**నెల్లూరు సిటీ (చైతన్యరథం)** : నెల్లూరు సిటీలో తనకు మెజారిటీ రావడం కోసం విశేషంగా కృషి చేసిన వారిలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు కూడా ఒకరని, 47వ డివిజన్‌కు కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న సుబ్బారావు... నాలుగు సార్లుగా డివిజన్ లో టీడీపీ తరుపున కార్పొరేటర్ గా విజయం సాధిస్తూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే, మాజీమంత్రి పి.నారాయణ వ్యాఖ్యానించారు. శనివారం నెల్లూరు గుప్తా పార్క్ సెంటర్‌లోని సుబ్బారావు ఇంటికి వెళ్లిన నారాయణ...శాలువాతో సుబ్బారావును సత్కరించి అభినందనలు తెలియజేశారు. పార్టీ పట్ల అంకిత భావంతంతో పని చేస్తున్న సుబ్బారావుకు త్వరలోనే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఈమేర కు నారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో 47వ డివిజన్ ఇన్ ఛార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్చెల్సీ నీటి సరఫరాకు అవరోధాల్లేకుండా చూడండి

- అధికారులకు ఎమ్మెల్యే కాలవ సూచన



**రాయదుర్గం (చైతన్యరథం):** తుంగభద్ర ఎగువ కాలువలో నీటి సరఫరాకు ఈ ఏడాది ఎక్కడా అవరోధాల్లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులకు రాయదుర్గం శాసనసభ్యుడు కాలవ శ్రీనివాసులు సూచించారు. శనివారం ఉదయం అనంతపురములోని తన స్వగృహంలో హెచ్చెల్సీ ఎస్ఇ రాజశేఖర్, ఈఈ రమణారెడ్డిలతో సమావేశమైన ఆయన కాలువ పరిస్థితిని సమీక్షించారు. ప్రధానంగా తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ నాగులాపురం వద్ద బలహీనంగా మారిందని, అక్కడ తక్షణ మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉందని కాలవ పేర్కొన్నారు. వీహెచ్చెల్సీ పొడవునా చాలా చోట్ల వంతెనలు దెబ్బతిన్నాయని, దర్గా హొన్నూరు, గంగలాపురం, గరుడచేడు, తదితర చోట్ల వంతెనలు కూలి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్న వాతావరణ శాఖ ముందస్తు అంచనాల నేపథ్యంలో హెచ్చెల్సీ లో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకూడదని పేర్కొన్నారు. ఈ నెలాఖరులో తుంగభద్ర రిజర్వాయరు నుంచి నీటి సరఫరా ప్రారంభమయ్యే అవకాశాలున్నందున యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన మరమ్మత్తులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కాలువకు రెండు చోట్ల తక్షణ రిపేర్ల కోసం రూ. 60 లక్షలు అవసరమని అధికారులు ఈ సందర్భంగా కాలవ దృష్టికి తెచ్చారు. సంబంధిత ఉన్నతాధికార్లతో మాట్లాడి నిధులు అందే విధంగా చూస్తామని ఎమ్మెల్యే వారికి మాట ఇచ్చారు.

# అవినీతిపై రామోజీ అక్షరం ఆయుధంలా పనిచేసింది

- రామోజీ ఫిలింసిటీలో నివాళులర్పించిన టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



**హైదరాబాద్ / అమరావతి (చైతన్యరథం)** : కృషి ఉంటే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని నిరూపించిన మహామనిషి రామోజీరావు అని, తుదిశ్వాస వరకూ మడమ తిప్పని పోరాటం చేశారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వ్యాఖ్యానించారు. శనివారం రామోజీ ఫిలింసిటీలోని రామోజీరావు పార్థివదేహానికి అనురాధ నివాళులర్పిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... 'అవినీతిపై రామోజీరావు అక్షరం ఒక ఆయుధంలా పనిచేసింది. ప్రజా నాయకులు అవినీతి గురించి ఆలోచించాలంటే భయపడే విధంగా వారి ఆర్టికల్స్ ఉండేవి. సామాన్యుల ఆలోచనా విధానాన్ని కూడా ఉన్నతస్థాయికి తీసుకెళ్లే విధంగా వారి ఎడిటోరియల్స్ ఉండేవి. ఈటీవీ, ఈనాడు పేపర్‌ను అనుసరించే మంచి ప్రజాప్రతినిధిగా ఎదిగాను. రామోజీలాంటి మనిషి మళ్లీ పుట్టాలంటే వెయ్యి జన్మలు ఎత్తాల్సిందే. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.' అని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వ్యాఖ్యానించారు.

# వైసీపీ కవ్వింపు చర్యలకు స్పందించొద్దు

- సంయమనంతో ముందుకు సాగాలి : జ్యోతుల నెహ్రూ పిలుపు



**కాకినాడ (చైతన్యరథం):** ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయారని, అరాచక పాలనను తరిమికొట్టి ఎన్డీయే కూటమికి భారీ మెజారిటీతో అధికారాన్ని కట్టబెట్టారని టీడీపీ ఎమ్మెల్యే జోత్యుల నెహ్రూ వ్యాఖ్యానించారు. ఎన్డీయే కూటమి గెలుపును జీర్ణించుకోలేని కొంతమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు పలుచోట్ల కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని, దీనికి కూటమి నాయకులు, కార్యకర్తలు స్పందించొద్దని సంయమనం పాటించాలని కోరారు.

ఎన్డీయే పక్ష సమావేశాలతో అధినేత చంద్రబాబునాయుడు తీరిక లేకుండా గడుపుతున్నారని, ప్రతిఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షులు మారిశెట్టి భద్రం, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షులు వీరం రెడ్డి కాశిబాబు, జగ్గంపేట నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడాల రాంబాబు, కిర్లంపూడి మండల తెలుగు రైతు అధ్యక్షులు కాకిలేటి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మీ ఫోన్ హ్యాక్ అయ్యిందా..?



ప్రస్తుత టెక్ యుగంలో.. టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందుతోంది. మనుషులు ఊహించలేని స్థాయిలో, ప్రపంచాన్నే అబ్బురపరిచే కొత్త కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో.. అంతకు మించిన నష్టాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కొందరు కేటుగాళ్లు తమ స్వార్థ ప్రయోజనాల కోసం టెక్నాలజీని దుర్వినియోగం చేస్తున్నారు. అందినకాడికి దోచేసుకుంటున్నారు.



మొబైల్ చేతిలో ఉంటే చాలు.. అన్ని పనులు చేసుకోవచ్చు. ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్ మొదలు.. షాపింగ్, బిల్ పేమెంట్స్, ప్రభుత్వ పథకా లకు అప్లికేషన్స్, డాక్యుమెంట్స్, స్టడీ.. ఇలా ఒకటేమిటి అన్ని పనులకు మొబైల్ ఉపకరిస్తుంది. అయితే, ఆ మొబైలే ప్రజల కొంప ముంచుతోంది.

సైబర్ నేరగాళ్లు ప్రజల మొబైల్స్ హ్యాక్ చేసి.. వారి పర్సనల్ విషయాలతో పాటు, అకౌంట్లలోని డబ్బులను కూడా కాజేస్తున్నారు. అసలు మొబైల్ హ్యాక్ అయిన విషయం కూడా కొందరు ప్రజలకు తెలియదు. అందుకే.. ఇవాళ మీకోసం కీలక వివరాలు తీసుకొచ్చాం. ఒకవేళ మీ మొబైల్ హ్యాక్ అయినట్లే కొన్ని లక్షణాలు మీ మొబైల్‌లో కనిపిస్తాయి. అవి గనుక మీ మొబైల్‌లో కనిపిస్తే.. వెంటనే అలర్ట్ అవ్వాల్సి ఉంటుంది. లేదంటే తీవ్ర నష్టం తప్పదు.



## అనుమానం వస్తే ఏం చెయ్యాలి?

ఫోన్ హ్యాక్ అయ్యిందనిపిస్తే కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది. ముందుగా కాంటాక్ట్ నంబర్లన్నింటికీ ఫోన్ హ్యాక్ అయ్యిందనే విషయాన్ని తెలపాలి. మన ఫోన్ నుంచి వచ్చే అనుమానిత లింకులేవీ క్లిక్ చేయొద్దని తెలియజేయాలి.

1. ఫోన్ వై-ఫై, మొబైల్ డేటాను టర్న్ఆఫ్ చేయాలి. దీంతో మోసగాళ్లకు ఫోన్ మీద మరింత ఆధిపత్యం దక్కకుండా చేయొచ్చు.
2. ఫోన్‌లోని మాల్వేర్‌ను గుర్తించి, తొలగించటానికి యాంటీ-మాల్వేర్ సాఫ్ట్‌వేర్ తోడ్పడుతుంది. దీన్ని తరచూ రన్ చేస్తుండాలి. ఒకవేళ అలాంటి సాఫ్ట్‌వేర్ లేనట్లయితే యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ను లోడ్ చేసి, రన్ చేయాలి.
3. ఫోన్ హ్యాక్ అయినప్పుడు లాగిన్ పాస్‌వర్డ్‌లను మోసగాళ్లు తెలుసుకునే ప్రమాదముంది. కాబట్టి మాల్వేర్‌ను తొలగించిన తర్వాత అన్ని పాస్‌వర్డ్‌లను రీసెట్ చేసుకోవాలి. ప్రతి ఖాతాకూ వేర్వేరుగా కఠినమైన పాస్‌వర్డ్‌లను నిర్ణయించుకోవాలి.
4. ఫోన్‌లో పొరపాటున మాల్వేర్ చొరపడ టానికి ప్రధాన కారణం అనుమానిత యాప్‌లను డౌన్ లోడ్ చేసుకోవటం. ఫోన్ హ్యాక్ అయ్యిందని అని పిస్తే యాప్‌ల జాబితాను నిశితంగా పరిశీలించాలి.



థర్డ్ పార్టీ యాప్ స్టోర్ నుంచి లేదా అనధీకృత సోర్సుల నుంచి డౌన్‌లోడ్ అయిన యాప్‌లు కనిపిస్తే వెంటనే డిలీట్ చేయాలి. ఆ యాప్‌లు ఏయే డేటాను యాక్సెస్ చేస్తున్నాయో కూడా చూడాలి. దీంతో ఏ ఖాతా పాస్‌వర్డ్‌లు మార్చాలో తెలుస్తుంది. అవసరమైతే వ్యక్తిగత సమాచారాన్నీ అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.
5. ఫ్యాక్టరీ రీసెట్ చేస్తే చాలావరకు మార ర్ తొలగిపోతుంది. అయితే దీంతో ఫోన్‌లో స్టోర్ అయిన ఫొటోలు, నోట్స్, కాంటాక్ట్స్ వంటి సమాచారమూ పోతుంది. కాబట్టి ఫోన్‌ను రిస్టోర్ చేయటానికి ముందు డేటాను బ్యాకప్ చేయాలి. అయితే యాప్స్‌ను బ్యాకప్ చేయొద్దు. ముఖ్యంగా ఫోన్‌లో మాల్వేర్ ఉన్నట్టు అనుమానిస్తే అసలే యాప్స్‌ను బ్యాకప్ చేయొద్దు. తిరిగి డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన యాప్స్ పేర్లను రాసి పెట్టుకోవాలి. అవి విశ్వసనీయమైనవని తెలుసుకున్నాకే డౌన్‌లోడ్ చేసుకోవాలి
6. అదనపు భద్రత కోసం ముఖ్యమైన యాప్‌లన్నింటికీ టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ సెట్ చేసుకోవాలి.
7. యాప్‌లకు ఇచ్చిన అనుమతులను సమీక్షించుకోవాలి. ఫోన్ ఫీచర్లకు, డేటాకు అనవసరంగా యాక్సెస్ ఇచ్చినట్టయితే డిసేబుల్ చేసుకోవాలి.
8. బ్యాంకు ఖాతాలు, ఈమెయిళ్లు, ఇతర రహస్య ఖాతాల వంటి వాటిల్లో ఏదైనా అనుమానిత కార్యకలాపాలు జరుగుతున్నాయేమో ఓ కంట కనిపెడుతుండాలి.
9. 'సమస్యను పరిష్కరించటం తెలియకపోతే పోతే సైబర్ సెక్యూరిటీ నిపుణుల సాయం తీసుకోవాలి.

## ఫోన్‌ను ఎలా హ్యాక్ చేస్తారు?



స్మార్ట్‌ఫోన్ హ్యాకర్లు రకరకాల పద్ధతులతో ఫోన్‌లోకి చొరబడతారు. ఫిషింగ్ అటాక్స్, స్మిషింగ్ అటాక్స్, స్పైవేర్, అన్ సెక్యూర్ వైఫై, హానికర యాప్‌ల వంటి వాటిని ఇందుకు వాడుకుంటారు.

ఈమెయిల్, టెక్ట్స్ మెసేజ్, ఫోన్ కాల్స్ ద్వారా ఫిషింగ్‌కు పాల్పడతారు. నమ్మకమైన వనరులేనని భావించేలా చేసి బురిడీ కొట్టిస్తారు. ఎస్ఎంఎస్, ఫిషింగ్ కలయికే స్మిషింగ్. ఈమెయిళ్ల కన్నా టెక్ట్స్ మేసేజ్‌లనే ఎక్కువదా నమ్ముతుంటారు. కాబట్టి సైబర్ నేరగాళ్లు ఎస్ఎంఎస్‌లతో మోసం చేస్తుంటారు. ముందు హానికర లింక్‌తో కూడిన మెసేజ్‌ను పంపిస్తారు. దాన్ని క్లిక్ చేసి వ్యక్తిగత సమాచారం ఇవ్వగానే దాని సాయంతో మోసానికి తెగబడతారు. స్పైవేర్ అనేది ఒకరకం మాల్వేర్. మోసగాళ్లు మన ప్రమేయం లేకుండా, మనకు తెలియకుండానే ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తారు. ఇది గుట్టుగా మన సమాచారాన్ని దొంగిలిస్తుంది. స్పైవేర్లలో యాడ్వేర్, ట్రోజన్స్, ఇంటర్నెట్ ట్రాకర్స్, కీబోర్డు లాగర్స్ వంటి రకరకాలు ఉన్నాయి. పబ్లిక్ వైఫై వంటి అన్‌సెక్యూర్ వైఫైని వాడేటప్పుడూ హాకర్లు తేలికగా ఫోన్‌లోకి చొచ్చుకొచ్చేస్తారు. హానికర యాప్‌లను ఇన్‌స్టాల్ చేస్తుంటారు.

### నివారించుకోవచ్చా?

1. పాస్‌వర్డ్ మేనేజర్ వంటి భద్రమైన యాప్‌ను వాడితే తప్ప ఫోన్‌లో పాస్ వర్డ్‌లు, క్రెడిట్ కార్డు వివరాల వంటి కీలక మైన సమాచారాన్ని సేవ్ చేయొద్దు.
2. ఫోన్‌కు ఇతరులు ఊహించలేని కఠినమైన పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి.
3. ముఖ్యమైన యాప్స్‌ను పాస్‌వర్డ్‌తో లాక్ చేసుకోవాలి.
4. బ్లూటూత్‌ను వాడుతున్నప్పుడే ఆన్ చేయాలి. మిగతా సమయాల్లో తప్పని సరిగా ఆఫ్‌లో పెట్టుకోవాలి.
5. ఆ అప్పుడప్పుడు పాపప్స్, బ్యాటరీ త్వరగా నిండుకోవటం వంటి అసాధారణ యాక్టివిటీ ఏమైనా జరుగుతుందేమో గమనిస్తుండాలి.
6. సాఫ్ట్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్స్ విడుదలైన వెంటనే అప్‌డేట్ చేసుకోవాలి.
7. డేటాను రక్షించుకోవటానికి తరచూ ఫోన్‌ను బ్యాకప్ చేసుకోవాలి.
8. పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లను వాడుకునే టప్పుడు అప్రమత్తంగా ఉండాలి. అదనపు భద్రత కోసం వీపీఎన్‌ను వాడుకోవాలి.
9. విశ్వసనీయమైన మొబైల్ సెక్యూరిటీ యూప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
10. అంతర్జాలాన్ని వాడేటప్పుడు చేయాల్సిన, చేయకూడని పనుల గురించి తెలుసుకొని, జాగ్రత్తగా మెలగాలి.

